https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సార్థ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 సంచిక : 297 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | గురువారం, ఆగస్టు,27, 2026 | పేజీలు : 8 వెల : రూ.1/-

# చక్కెర ధరలపై కేంద్రం మాస్టర్ ప్లాన్..



**న్యూఢిల్లీ,ఆగస్టు 26:**దేశీయ మార్కెట్లో ఇటీవల భారీగా పెరిగిన చక్కెర ధరలు ఇప్పుడు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలు, మార్కెట్‌పై పెంచిన పర్యవేక్షణతో చక్కెర మిల్లుల వద్ద ధరలు గణనీయంగా తగ్గాయి. ఇప్పటికే ఎక్స్-మిల్ ధరలు 18 శాతం మేర తగ్గి కిలోకు రూ.55కు చేరుకున్నాయి. దీంతో రానున్న రోజుల్లో చిల్లర మార్కెట్లోనూ ధరలు తగ్గే అవకాశం కనిపిస్తోంది. గత 15 నుంచి 20 రోజులుగా దేశీయ చక్కెర మార్కెట్లో ధరలు అనూహ్యంగా పెరిగాయి. ఎక్స్-మిల్ ధర కిలోకు రూ.67 వరకు చేరి సరికొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. దీంతో టోకు, చిల్లర మార్కెట్లలోనూ చక్కెర ధరలు భారీగా పెరిగాయి. ఈ పరిస్థితి నేరుగా సామాన్య వినియోగదారులపై ఆర్థిక భారాన్ని పెంచింది. కేంద్ర ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా వెల్లడించిన వివరాల ప్రకారం, కొన్ని చక్కెర మిల్లులు ఇష్టానుసారంగా ధరలను పెంచడం కూడా ఈ ఆకస్మిక పెరుగుదలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉంది.

దీంతో సరఫరా గొలుసులో ధరలపై ఒత్తిడి పెరిగి, కృత్రిమ ద్రవ్యోల్బణ పరిస్థితి ఏర్పడినట్లు ప్రభుత్వం భావించింది. చక్కెర ధరలు కిలోకు రూ.67 వరకు చేరడంతో కేంద్ర ప్రభుత్వం పరిస్థితిని నియంత్రించేందుకు కీలక చర్యలు చేపట్టింది. దేశీయ మార్కెట్లో సరఫరా కొరత ఏర్పడకుండా ఉండేందుకు విదేశీ మార్కెట్ల నుంచి చక్కెర దిగుమతులకు మార్గం సుగమం చేసింది. దిగుమతుల ద్వారా దేశీయ మార్కెట్లో చక్కెర లభ్యతను పెంచడంతో పాటు, కొరత భయాన్ని తొలగించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారింది. మార్కెట్లో నిల్వదారు లు లేదా ఇతర వర్గాలు సరఫరాను నియంత్రించి ధరలను పెంచే అవకాశాలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# భారీగా పెరిగిన చాయ్ ధర!

హైదరాబాద్: హైదరాబాదీలకు ఎంతో ప్రియమైన చాయ్ ధర అమాంతం కొండెక్కింది. నిన్నమొన్నటి వరకు గల్లీ షాపుల్లో రూ.10 ఉన్న కప్పు టీ ధర ఎప్పుడు ఏకంగా రూ.20కి చేరింది. ఇక ఓ మోస్తరు టీస్టాళ్లు, ఇరానీ హోటళ్లలో ఏకంగా రూ.25 నుంచి రూ.30 తీసుకుంటున్నారు. ఎందుకిలా అంటే.. కారణమని తెలుస్తోంది. కిలో చక్కెర రూ.69కిచేరడంతో చాయ్ ధర పెంచక తప్పలేదని నిర్వాహకులు చెబుతున్నారు.పాతబస్తీ, చార్మినార్, అబిడ్స్, అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి పరిధిలోని ఇరానీ కేఫ్‌లలో ఇరానీ చాయ్ రూ.30, దమ్ చాయ్ రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం టీ తాగేవారికి రోజుకు రూ.20, నెలకు రూ.600 అదనపు భారం పడుతోంది.



## కొండా సురేఖ ఎపిసోడ్‌పై రాయబారం..

# భట్టితో కొండా మురళి భేటీ..

**హైదరాబాద్,ఆగస్టు 26:**తెలంగాణ కాంగ్రెస్?లో మంత్రి కొండాసురేఖ వ్యవహారం రోజు రోజుకు ఉత్కంఠ రేపుతోంది. ఆమెపై అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకోబోతోందనే సస్పెన్స్ కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కొండా సురేఖ భర్త కొండా మురళి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విడివిడిగా భేటీ అయ్యారు. ఇవాళ ప్రజాభవన్‌లో భట్టిని కలిసి పార్టీలో ఇటీవల జరిగిన తాజా పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. అయితే మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ నియమావళిని ఉల్లంఘించడం ఇది మూడోసారని, అలాగే చిన్నారెడ్డి సైతం లైన్ దాటి మాట్లాడారని ఇక విరిని ఉపేక్షిస్తే పార్టీకి తీవ్రనష్టం వాటిల్లుతుందని కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ (డీఏసీ) పీసీసీ చీఫ్ కు నివేదిక స మర్పించింది. ఈ నేపథ్యంలో కొండాపైవేటు తప్పదనే చర్చ జరుగు తున్న వేళ కొండా మురళి భట్టీతే భేటీ కావడం ఆసక్తిగా మారింది. భట్టితో రాజగోపాల్ రెడ్డి భేటీ కావడంహాట్ డిస్కషన్ గా మారింది. కొండాసురేఖ, చిన్నారెడ్డిపై వేటు వేస్తే అదితనపై కూడాచర్యలు తప్పవనే రాజగోపాల్ రెడ్డి అప్రమత్తమయ్యారా అనే టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే వేటు నుంచి తప్పించుకునేందుకు ముందస్తుగా రా జగోపాల్ రెడ్డి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. భటివిక్రమార్కతో భేటీ అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. మాబిడ్డ కొండా సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదన్నారు. ఆమెమనోభావాలు ఆమెకు ఉంటాయని ఆమెను ప్రశ్నించే హక్కు మాకు లేదన్నారు. మాకు గాంధీ కుటుంబంపై సంపూర్ణ విశ్వాసం ఉందని మేం కాంగ్రెస్‌లోనే కొనసాగుతామన్నారు.



# నేపాల్‌లో జల ప్రళయం, 8 మంది మృతి

**న్యూఢిల్లీ,ఆగస్టు 26:**టిబెట్ నుంచి ఆకస్మికంగా పోటెత్తిన వరదలు ఉత్తర నేపాల్‌లో పెను విషాదాన్ని మిగిల్చాయి. బుధవారం ఉదయం చైనా సరిహద్దును ఆనుకుని ఉన్న రసువా జిల్లాను ముంచెత్తిన ఈ వరద ప్రవాహంలో కనీసం ఎనిమిది మంది మరణించగా, వందలాది మంది గల్లంతయ్యారు. గ్రామాలు, రహదారులు, వంతెనలతో పాటు అనేక జల విద్యుత్ కేంద్రాలు ఈ ఉద్ధృతికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉదయం 9 గంటల సమయంలో భోటే కోశి నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో చైనా-నేపాల్ సరిహద్దులోని టిమూరే, స్యాఫ్రూ బేసి ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి.



## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలతో దెబ్బతింటోన్న

# హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్


### మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్,ఆగస్టు 26:** నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈరోజు ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకినెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.



# పంజాబ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల పోరుబాట

పంజాబ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కదం తొక్కనున్నారు. గురువారం, ఆగష్టు 27న రాష్ట్రవ్యాప్త మహాబంద్‌కు పిలుపునిచ్చారు. మొత్తం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి 4 లక్షల మంది ఈ బంద్‌లో పాల్గొననున్నారు. ఆప్ ప్రభుత్వం తమకు చెల్లించాల్సిన డీఏలుఇంకా విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ వారు ఈ ఆందోళన చేపట్టనున్నారు. దీంతో గురువారం మొత్తం ప్రభుత్వ కార్యకలాపాలతోపాటు, ప్రైవేటు కార్యకలాపాలు కూడా స్తంభించే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రస్తుత బంద్ రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు అందరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తడం, దీనికి ప్రతిపక్ష బీజేపీ మద్దతు ఇవ్వడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. పంజాబ్ బీజేపీ అధ్యక్షుడు కేవల్ సింగ్‌ధిల్లాన్ మాట్లాడుతూ ఈమహా బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం డీఏ చెల్లించకపోవడానికి సరైన కారణం చెప్పలేకపోతోందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వాదనలను పంజాబ్, హరియాణా హైకోర్టు తిరస్కరించాయని గుర్తు చేశారు. తాజా మహా బంద్ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు చేస్తున్న కీలక డిమాండ్లివి. పెండింగ్ ఉన్న డీఏను వెంటనే చెల్లించాలి. అది కూడా 18 శాతం డీఏ. పాత పెన్షన్ స్కీంనే అమలు చేయడంతోపాటు, కాంట్రాక్ట్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా డీఏతోపాటు, ఇతర బకాయిలను కూడా చెల్లించాలని పెన్షనర్ల సంఘాలు కోరుతున్నాయి. మహాబంద్‌లో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి.





# ఘనంగా మీలాద్ ఉన్ నబి వేడుకలు...



బెల్లంపల్లి (డీకే చాటింపు )పవిత్ర మీలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి పట్టణంలో ముస్లిం సోదరులు భారీ ఊరేగింపు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ లు పాల్గొని, ముస్లిం లకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా దీవెనలు ప్రతి ఒక్కరి పై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమం లో పలువురు ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు

# నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతుల్లో చిగురించిన ఆశలు

నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 27 (డీకే చాటింపు): నిజామాబాద్ ,కామారెడ్డి జిల్లాల రైతులకు వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు కు ఆశాజనకంగా వరద నీరు రావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. గోదావరి నది మంజీరా ఉపనది కింద ఉన్న ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 13 టీఎంసీల నీరు నిలువ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా ప్రస్తుతం బుధవారం ఉదయం 1401.68 అడుగులు ఉంది. ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఇప్పటివరకు దాదాపు రెండు లక్షల 35 వేల ఎకరాలు పంటలు రైతులు పండిస్తున్నారు. ప్రాజెక్టులోకి 2450 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని ఏఈ తెలిపారు. కాలువల ద్వారా నీటిని వదలండి నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో వరి పంట రైతులు అధికంగా వేశారని పంటలకు కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ సొసైటీ చైర్మన్ కూచి సిద్దు మాజీ ఎంపీటీసీ కొట్ట మనోహర్, సర్పంచ్ బర్ల మధు, సాయి రెడ్డి తదితరులు కోరారు. బుధవారం రోజు ప్రైవేటు కార్యక్రమంలో



పాల్గొనటానికి విచ్చేసిన బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి నీ పలువురు రైతులు, నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు.

# ప్రశాంతి హిల్స్ డివిజన్ 58 కు నూతన యూత్ అధ్యక్షుడి నియామకాంపై సామిడి గోపాల్ రెడ్డి హర్షం వ్యక్తం



మహేశ్వరం, (డీకే చాటింపు) టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమి టీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డిని మర్యాద పూర్వకంగా అయన నివాసం లో కలిశారు అనంతరం సామిడి గోపాల్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువతో సత్కారించారుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లో కష్ట పడ్డవారికి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని నాతోపాటు పార్టీకి పనిచేసేవారికి కె ఎల్ ఆర్ మరియు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అండగా ఉంటారని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమ్మలా రవీందర్ రెడ్డి, మట్ట సత్య నారాయణ కోప్షన్ సభ్యులు, జెటవత్ రవినాయక, టీజీ యూత్ సెక్రటరీ చరణ్ రెడ్డి సామిడి ధరరత్ స్వామి నాయక్, మహిళా అధ్యక్షులు కాట్నే పద్మశ్రీ, రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ పద్మ రెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులు నక్క బాలకృష్ణ, గండికోట అంజయ్య. కేతా వత్ చిన్న, మూర్తి తదితరులు పాల్గొన్నారు,

# స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డికి నివాళులు -తాత ఆశయ సాధనకు ముందుకు..

**-చిట్టెం అభిజయ్ రెడ్డి...**

నారాయణపేట,(డీకే చాటింపు): స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి జయంతి సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు,మాజీ శాసనసభ్యులు స్వర్గీయ చిట్టెం నర్సిరెడ్డి విగ్రహానికి బుధవారం చిట్టెం అభిజయ్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ధన్వాడలో తాత(దివంగత చిట్టెం నర్సిరెడ్డి)సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. తాత చూపిన ఆశయాలు, సిద్ధాంతాల బాటలో నడుస్తూ,వాటిని నిరంతరం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అలాగే నారాయణపేటలో చిట్టెం నర్సిరెడ్డి విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు జి. సుధాకర్,బండి వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి,ఎండి సలీం,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రాస్ రూట్ కు దూరంగా కవిత...




**హైదరాబాద్,** : మొగుడు కొట్టినందుకు కాదు తోటికోడలు నవ్వినందుకే నే ఏడుస్తున్నా" అనే నానుడి తెలంగాణ రాజకీయాల్లో అచ్చం సరిపోతుంది. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు విన్నప్పుడు ప్రతి ఒక్కరికీ ఇదే నిజమనిపిస్తుంది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు గురించి, లాభనష్టాల గురించి లోతుగా లెక్కలు వేసుకున్న తర్వాతే కేటీఆర్ విద్యార్థులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. కానీ కవిత మాత్రం ఆ మాత్రం ధైర్యం కూడా చేయలేకపోయారు. దాదాపు నెలరోజులుగా ఢిల్లీలో విద్యార్థులు తీవ్రమైన ఆందోళనలు చేస్తున్నా, ఆ పోరాటాలు ఎంతో ఉద్రిక్తంగా మారినా ఆమె ఎప్పుడూ మొక్కుబడిగా స్పందించారే తప్ప విద్యార్థులకు నిజమైన అండగా నిలబడే ప్రయత్నం ఎన్నడూ చేయలేదుఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలు పూర్తిగా ముగిసిన తర్వాత మీడియా ముందుకు వచ్చి తాపీగా మాట్లాడడం ఆమె వైఫల్యానికి నిదర్శనం. ఆ సమయంలో ఊరుకుంటే బాగుండేది కానీ ఆమె అనవసరమైన విమర్శలకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు విద్యార్థులతో కలిసి శనివారం సాయంత్రం భారీ ర్యాలీలో పాల్గొనడాన్ని ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల విజయాన్ని స్వయంగా తన ఖాతాలో వేసుకున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వాన్ని కూడా విద్యార్థులు ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయంతోనే రేవంత్ రెడ్డి ఈ కొత్త నాటకాలు ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పోరాటాలు చేయకుండా కేవలం మాటలతో కాలక్షేపం చేసే నాయకులకు ఇటువంటి విమర్శలు చేయడం పరిపాటిగా మారింది.

# చేనేత సొసైటీల ఆక్రమాలపై ఇంటింటా ప్రచారం-వీధి వీధి పర్యటనలు..!

**-సెప్టెంబర్ 9న కలెక్టరేట్ ముందు మహాధర్నా... -ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి... -అఖిలపక్ష నేతల పిలుపు... -చేనేత సొసైటీలలో ఆక్రమాలపై నారాయణపేటలో కొత్త తరహాలో ప్రచారం...**



నారాయణపేట,(డీకే చాటింపు): చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని,సొసైటీల్లో జరుగుతున్న అక్రమ లావాదేవీలను అరికట్టాలని ఇంతవరకు జరిగిన రూ.51 కోట్ల అక్రమ లావాదేవులపై వెంటనే విచారణ చేపట్టాలని కోరుతు అఖిలపక్ష నేతలు, కార్మిక సంఘాల నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించి నేత కార్మికులను ఆకట్టుకున్నారు. సెప్టెంబర్ 9 న,నారాయణపేట జిల్లా కలెక్టర్ ముందు చేపట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ అఖిలపక్షం నేతలు, కార్మిక సంఘాల నేతలు బుధవారం నారాయణపేట మున్సిపాలిటీలోని 16వ, వార్డు మడి ఏరియాలో చేనేత కార్మికులు నివసించే కుటుంబాల నివాసాలకు వెళ్లి ఇంటింటా ప్రచారం చేశారు. దాంతో ఈ ప్రచారం అందర్నీ ఆకర్షిస్తుంది. అర్హులైన చేనేత కార్మికులకు సొసైటీలలో సభ్యత్వం కల్పించాలని, సభ్యత్వం కోసం ధరఖాస్తు శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని నేతలు ఆరోపించారు. ముడి సరుకుల ధరలు పెరగడం, నేసిన చీరల గిట్టుబాటు ధర రాకపోవడం,పవర్ లూమ్స్ యంత్రాలు రావడం తదితర కారణాలతో చేనేత వృత్తి కొనసాగించలేని పరిస్థితి ప్రస్తుతం ఉత్పన్నమైందని ఆందోళన వ్యక్తం చేశారు. నేతన్న అప్పులపాలవుతూ వలస బాట పడుతున్నారని, ఆకలితో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు నోచుకుంటూ ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం కాపాడాలని వారు డిమాండ్ చేశారు. నేతన్న పొదుపు పథకంలో జియో ట్యాగింగ్లో సొసైటీ పెద్దలు అనేక అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. ఇంటింటా ప్రచారంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం ,చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కెంచి నారాయణ,ఎస్సి ఉపకులాల రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు గడ్డం కృష్ణయ్య,జిల్లా అద్యక్షులు



పెట్టుకున్నప్పటికి ఇవ్వడం లేదని కార్మికులు తమ దృష్టికి తీసుకొని వచ్చారని వారు తెలిపారు. నేతన్న చేయూత బీమా రూ.5 లక్షలు మరణించిన కార్మికుడి కుటుంబానికి పూర్తిస్థాయిలో అందడం లేదని సంఘాల నేతలు ఆరోపించారు. కొంత మందికి అర్హత ఉన్నప్పటికిని వారికి అందివ్వడంలో సొసైటీ పెద్దలు విఫలమయ్యారని విమర్శించారు. ఈ వ్యవహారంలో సొసైటీ అధ్యక్షులు,కార్యదర్శులు, జౌళి సల్ల వెంకటేష్, బిఎస్పి నారాయణపేట నియోజకవర్గ అధ్యక్షులు దాసరి అశోక్,మదర్ తెరిసా సొసైటీ అధ్యక్షులు యూసుఫ్ తాజ్,చేనేత కార్మిక సంఘం నాయకులు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు తుల్జారామ్,సిపిఎం పట్టణ నాయకులు నరహరి,చేనేత కార్మిక సంఘం పట్టణ నాయకులు యాబన్న చౌదరి,వద్ధి నారాయణ, తగడఘర్ ప్రకాష్ రావు, తగడఘర్ పుండలిక్ రావు, శ్రీకాంత్,చిన్న జట్రం సిరం వెంకటేష్ పాల్గొన్నారు

# పోచారం భాస్కర్ రెడ్డి పై రుద్రురూ పోలీస్ స్టేషన్లో టిఆర్ఎస్ నేతల ఫిర్యాదు

నిజామాబాద్ ప్రతి నీది ఆగస్టు 27 (డీకే చాటింపు): వర్ని మండలం తగిలేపల్లి లో జరిగిన మాజీ సర్పంచ్ హత్య కేసులో ఎలాంటి సంబంధం లేని టిఆర్ఎస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన డిసిసిబి బ్యాంకు మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పై కేసు నమోదు చేయాలని డిఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశాయి . దిష్టిబొమ్మ దహనం చేసి బాజిరెడ్డి పై బురద చల్లడానికి ప్రయత్నించారు. కాంగ్రెస్ పార్టీ ముఠా తగాదాలతో పగిలేపల్లి గ్రామంలో ఒకరినొకరు హత్యలు చేసుకుంటూ వారి అనుచరులను కాపాడుకోవడం కోసం బాజిరెడ్డి పై ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు బాన్సువాడ ఎమ్మెల్యే కుమారుడైన మాజీ బ్యాంక్ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పై వర్ని రుద్రూర్ మండలాల టిఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్లో




ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రవి కిరణ్, మధు, తేల రవి తదితరులు ఉన్నారు.

# భారత్ కు జిన్ పింగ్

**న్యూఢిల్లీ :** 2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్?చైనా సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత దాదాపు ఆరేళ్లపాటు భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాకు వెళ్లలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌ను సందర్శించలేదు. ఇటీవలే భారత్?చైనా సంబంధాలు మళ్లీ పునరుద్ధరణ జరిగింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్రమోదీ కొన్ని నెలల క్రితం చైనా పర్యటనకు వెళ్లారు. ఇక ఇప్పుడు సెప్టెంబర్ 12?13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్‌కు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను మరింత తగ్గించి, కొత్త సంబంధాల పునాది వేసే అవకాశంగా ఉంది. గల్వాన్ ఘర్షణ తర్వాత సరిహద్దు ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, వాణిజ్య పరిమితులు వంటివి రెండు దేశాల సంబంధాలను దెబ్బతీశాయి. 2019లో మామల్లపురంలో జరిగిన అనధికారిక సమ్మిట్ తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. అయితే ఇటీవలి కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో కొంత మెరుగుదల కనిపిస్తోంది. 2024లో కజాన్‌లోనూ, 2025లో తియాన్‌జిన్‌లోనూ ప్రధాని మోదీ, జిన్‌పింగ్ కలుసుకున్నారు. సరిహద్దు విషయంలో కొన్ని అవగాహనలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ రాక భారత్?చైనా సంబంధాల్లో మరో ముఖ్యమైన మలుపుగా మారే అవకాశం ఉంది. భారత్ బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న సందర్భంలో జరుగుతున్న ఈ సమ్మిట్ ప్రపంచ రాజకీయాల్లో కూడా ముఖ్యమైనది. రష్యా, ఇరాన్ వంటి దేశాల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. పశ్చిమాసియా సంక్షోభం, గ్లోబల్ సౌత్ సమస్యలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ఉంటాయి. జిన్‌పింగ్ హాజరైతే ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలకు కూడా అవకాశం ఏర్పడుతుంది.

# మేయర్ కు మాతృ వియోగం

ఆర్మూర్ విలేఖరి ఆగస్టు 27, (డీకే చాటింపు): నిజామాబాద్ నగర మేయర్ ఉమారాణి తల్లి బేడిదా భారతి మంగళవారం రాత్రి 8 గంటలకు మృతి చెందారు. మనోరమా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమే తుదిశ్వాస విడిచారు. అంత్యక్రియలు బుధవారం నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు , బేడిద భారతి అంతిమయాత్రలో పాల్గొని వివాళులర్పించారు. ఆమే ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని పలువురు ప్రార్థించారు.



డీకే సార్ధకంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం, ఆగస్టు,27, 2026

# ఇండో-పసిఫిక్‌లో భారత్ వ్యూహాత్మక పంథా...

హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన సముద్ర వ్యూహాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో అండమాన్- నికోబార్ దీవుల్లోని గ్రేట్ నికోబార్‌ను అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ కేంద్రంగా అభివృద్ధి చేయడం, ఇండోనేషియాలోని సబాంగ్ పోర్టును సముద్ర సేవలు, లాజిస్టిక్స్, బంకరింగ్, మరమ్మతులు, పర్యాటకం, మత్స్య పరిశ్రమలకు కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు కొత్త ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ రెండు ప్రాజెక్టులు పరస్పరం పోటీ పడేలా కాకుండా ఒకదానికొకటి తోడ్పడే విధంగా అభివృద్ధి చెందితే, భారత్- ఇండోనేషియా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడటంతోపాటు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత వ్యూహాత్మక ఉనికి కూడా గణనీయంగా పెరుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతు న్నారు. భారత్ ఇండోనేషియా మధ్య సముద్ర సహకారం కొత్తది కాదు. 2018లో ఇరు దేశాలు ప్రకటించిన ఇండో- పసిఫిక్ సముద్ర సహకార ఉమ్మడి దృక్పథంలో అండమాన్ -నికోబార్ దీవులు, ఇండోనేషియాలోని అచె ప్రాంతాల మధ్య వాణిజ్యం, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాలను విస్తరించాలని నిర్ణయించాయి. అలాగే సబాంగ్, పోర్ట్ బ్లెయిర్, హేవ్‌లాక్ ప్రాంతాల మధ్య సముద్ర పర్యాటకాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యాన్ని కూడా నిర్దేశించుకున్నాయి. అనంతరం అండమాన్- అచె అనుసంధానంపై సంయుక్త టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి అనేక సమావేశాలు నిర్వహించాయి. ఇటీవలి సంవత్సరాల్లో భారత నముద్ర వ్యూహంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రపంచంలో అత్యంత రద్దీగా ఉండే మలక్కా జలసంధికి అత్యంత సమీపంలో ఉన్న గ్రేట్ నికోబార్‌ను అంతర్జాతీయ స్థాయి ట్రాన్స్‌షిప్‌మెంట్ కేంద్రంగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో సుమారు 14.2 మిలియన్ టీఇయు సామర్థ్యం గల కంటైనర్ టెర్మినల్, గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం, విద్యుత్ కేంద్రం, ఆధునిక పట్టణ నిర్మాణం వంటి అంశాలు ఉన్నాయి. ఇప్పటికే గలాథియా బే పోర్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులు లభించడంతో ప్రాజెక్టు అమలు దశలోకి ప్రవేశించింది. ఈ ప్రాజెక్టు వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం భారత విదేశీ వాణిజ్యానికి అవసరమైన ట్రాన్స్‌షిప్‌మెంట్ సేవల కోసం సింగపూర్, కొలంబో, పోర్ట్ క్లాంగ్ వంటి విదేశీ పోర్టులపై ఆధారపడాల్సిన పరిస్థితిని తగ్గించడం. భారత ఎగుమతులు, దిగుమతులు దేశీయ సముద్ర మౌలిక సదుపాయాల ద్వారా నిర్వహించే సామర్థ్యాన్ని పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం. ఇదే సమయంలో సబాంగ్ పోర్టు ప్రాధాన్యం మరింత స్పష్టమవుతోంది. గ్రేట్ నికోబార్ ప్రధానంగా కంటైనర్ రవాణా, ట్రాన్స్‌షిప్‌మెంట్ కార్యకలాపాలపై దృష్టి సారిస్తే, సబాంగ్ పోర్టు సముద్ర సేవలు, నౌకలకు ఇంధన సరఫరా, మరమ్మతులు, లాజిస్టిక్స్, గిడ్డంగుల నిర్వహణ, మత్స్య పరిశ్రమ, సముద్ర పర్యాటకం వంటి రంగాల్లో ప్రత్యేకతను సాధించగలదు. ఈ విధంగా రెండు పోర్టులు పరస్పరం అనుసంధానమైతే మొత్తం అండమాన్ సముద్ర ప్రాంతం సమగ్ర సముద్ర ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో మలక్కా జలసంధికి అత్యంత కీలకమైన స్థానం ఉంది. ప్రతి సంవత్సరం లక్షల పైగా వాణిజ్య నౌకలు ఈ మార్గం గుండా ప్రయాణిస్తాయి. ప్రపంచ ఇంధన రవాణాలో కూడా ఈ జలసంధి కీలక పాత్ర పోషిస్తోంది. ఇలాంటి వ్యూహాత్మక ప్రాంతానికి సమీపంలో భారత్‌కు గ్రేట్ నికోబార్, మిత్రదేశమైన ఇండోనేషియాకు సబాంగ్ వంటి ఆధునిక సముద్ర కేంద్రాలు అందుబాటులో ఉండటం వాణిజ్యపరంగానే కాకుండా భౌగోళిక- రాజకీయ కోణంలో కూడా విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. ఇండో- పసిఫిక్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా చైనా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్‌ఐ) ద్వారా సముద్ర, ఆర్థిక ప్రభావాన్ని విస్తరించేందుకు భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఇండోనేషియాలో కూడా చైనా అనేక ప్రాజెక్టులను చేపట్టినప్పటికీ, సబాంగ్ పోర్టు వాటిలో భాగం కాలేదు. గతంలో చైనా ఈ పోర్టుపై ఆసక్తి చూపినట్లు వార్తలు వచ్చినప్పటికీ, భద్రతా, వ్యూహాత్మక అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇండోనేషియా ఆ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లలేదు. ఈ నేపథ్యంలో భారత్- ఇండోనేషియా భాగస్వామ్యంతో సబాంగ్ అభివృద్ధి చెందడం వ్యూహాత్మకంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ ప్రాజెక్టు అధికారికంగా ఏ దేశాన్ని లక్ష్యంగా చేసుకుని రూపొందించబడలేదని గుర్తుంచుకోవాలి.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సార్ధకంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

# మంచిర్యాలలో జరిగే ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభ జయప్రదం చేయండి



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 27 (డీకే చాటింపు): మంచిర్యాలలో జరిగే ఏఐకేఎంఎస్ రాష్ట్ర తొమ్మిదవ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ తెలంగాణ 9వ రాష్ట్ర మహాసభలు 8,9 సెప్టెంబర్ 2026న మంచిర్యాల పట్టణంలో జరుగుతు న్నాయని అట్టి మహాసభకు అధిక సంఖ్యలో రైతులు, రైతుకూలీలు హాజరై విజయం విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య కోరారు. మహాసభ పోస్టర్లు కరపత్రాలు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో బుధవారం రోజున అర్సపల్లిలోని కచేరిలో జిల్లా ఉపాధ్యక్షులు సాయిలు తో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం భారత వ్యవసాయ రంగాన్ని బలిపీఠంపై నిలబెట్టుతుందని రైతుని వ్యవసాయంలో నిలబెట్టలేకపోతున్నారాని వరన్నారు. తీవ్ర సంక్షోభంలోకి వ్యవసాయం నెట్టబడుతుంది అని ఈ తరుణంలో అఖిల భారత రైతు కూలీ సంఘం తన 9వ మహాసభను జరుపు కుంటుందనిఅన్నారు. అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం పేరున ఆ దేశ ఆహార ఉత్పత్తులను మనదేశంలోకి ఎలాంటి సుంకలు లేకుండా దిగుమతి అవుతుంటే మన దేశ సరుకులు ఎగుమతి చేస్తే విపరీతమైన సుంకాలు వేస్తారనిఇది మన దేశ రైతులను కుదేలు చేసే విధానాలు అన్నారు. కష్టపడి పండించిన రైతు పంటకు కనీసం మద్దతు ధర చట్టాన్ని కేంద్రంలో తేలేకపోతున్న మోడీ ప్రభుత్వం,పంటలకు వాడేఅన్ని రకాల ఎరువులను పెంచేసి రైతునడ్డివిరుస్తుందని అయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతిమంగారైతులను తమ భూముల నుండి బేదకలు చేసి అట్టి భూములను కార్పొరేట్ సంస్థలకు ముఖ్యంగా ఆదానీ,అంబానీలకు కట్టబెడుతున్నారని వారన్నారు. నకిలీవిత్తనాలు ఎరువుల సమస్యలు, పంటలకు సరైన మార్కెట్ సౌకర్యాలు లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. మరోవైపు వ్యవసాయ కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి లభించక పోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు రక్షణ కల్పించే విధానాల స్థానంలో కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. రైతులకు రుణభారం, పంట నష్టాలు, గిట్టుబాటు ధరల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకూడారైతులు వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు రుణభారాన్ని తగ్గించేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, కనీస వేతనాలు, భూమి మరియు నివాస హక్కులు కల్పించడంతో పాటు గ్రామీణ పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు సెప్టెంబర్ 8,9 న మంచిర్యాలలో జరిగే ఏఐకేఎంఎస్ రాష్ట్ర 9వ మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని ఈ సభలో రాబోయే రోజులలో రైతాంగ ఉద్యమాన్ని నిర్మించేందుకుగానుతగినకర్తవ్యాలను, ప్రణాళికను రూపొందించు కుంటామని వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజాతంత్రవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి సాయిలు, కే గోపాల్,ఎం లింబాద్రి,బెండ ప్రవీణ్, హైబద్ దాసు, లక్ష్మణ్, సాకలి నారాయణ, కూచాద్రి స్వామి తదితరులు పాల్గొన్నారు

# ఆవు తోకతో అమ్మవారి విగ్రహాన్ని కదిలించి.. సింగారంలో శ్రీ పోచమ్మ దేవాలయ నిర్మాణానికి శ్రీకారం

**-అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించిన గ్రామ పెద్దలు... -విరాళాల సేకరణ ద్వారా సమకూరిన రూ.15లక్షలు... -శ్రీ పోచమ్మ దేవాలయానికి మంచి రోజులు వచ్చేశాయి... -హర్శిస్తున్న నారాయణపేట మండలం సింగారం గ్రామ ప్రజలు.. -ఖండమైన విగ్రహాలను కృష్ణా నదిలో నిమజ్జనం... -సాధ్యమైనంత త్వరగా దేవాలయాన్ని నిర్మించాలని గ్రామ పెద్దల నిర్ణయం...**





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం సింగారం గ్రామంలో దయనీయ స్థితిలో ఉన్న పోచమ్మ దేవాలయాన్ని నూతనంగా నిర్మించేందుకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణంలో భాగంగా గ్రామ దేవత సంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి భూమిని చదును చేశారు. గురువారం ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. ఆ గ్రామ సర్పంచ్ కె.నాగిరెడ్డి, శంకరప్ప చేతుల మీదుగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజారులు కోప్రేష్ చారి,జయతీర్థ చారి అమ్మవారికి అంబలితో శాస్త్రోక్తంగా,ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆ తర్వాత ఆవుకు పూజలు నిర్వహించి ఆవు తోకకు దారం కట్టి పోచమ్మ విగ్రహాన్ని ఆ స్థానం నుంచి కదిలించారు. ఆ తర్వాత అదే ప్రాంతంలో ఉన్న మిగతా విగ్రహాలను అక్కడి నుంచి మరోచోటకు తరలించిన తర్వాత ఆ ప్రాంతంలో భూమి చదును పనులు చేపట్టారు. ఖండమైన పలు విగ్రహాలకు పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక వాహనంలో కృష్ణా నదికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. గ్రామ దేవతపోచమ్మ అమ్మవారి స్థానం పూర్వ కాలం నుంచి దయనీస్థితిలో ఉంది. గతంలో పోచమ్మ అమ్మవారికి నూతనంగా నిర్మించాలని పలువురు గ్రామ పెద్దలు సంకల్పించిన వివిధ కారణాల చేత అది కార్యరూపం దాల్చలేదు. తాజాగా గ్రామ సర్పంచ్ కే. నాగిరెడ్డి హాయంలో అమ్మవారి దేవాలయాన్ని నిర్మించాలని గ్రామ పెద్దలు, ప్రజలు ప్రత్యేకంగా సమావేశమై చర్చించి జులై 20న సింగారం గ్రామంలో పోచమ్మ దేవాలయం దగ్గర పూజారి జయతీర్థ చారి గ్రామ పెద్దలు,ప్రజలతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయ నిర్మాణానికి అంకురార్పణ చేసిన విషయం పాఠకులకు విధితమే. అమ్మవారి దేవాలయం నిర్మాణానికి గ్రామ సర్పంచ్ కే.నాగిరెడ్డి 51,000 చెల్లించారు. ఆ తర్వాత ఒక్కొక్కరు తమకు తోచిన విరాళాలను అందజేశారు. అమ్మవారి ఆలయ నిర్మాణానికి గ్రామ ప్రజల నుంచి సేకరించిన విరాళాలకు విశేష స్పందన లభించడం.. ఈ విరాళాల రూపకంగా దాదాపు రూ.15 లక్షలు జమ అయినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛందంగా సేకరించిన విరాళాల ద్వారా అమ్మవారి దేవాలయాన్ని సర్వ సుందరంగా నిర్మించాలని ఆ గ్రామ ప్రజలు నిర్ణయించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ కే.నాగిరెడ్డి,గ్రామ పెద్దలు కే.భాస్కర్ రెడ్డి,జి. గోపాల్ రెడ్డి,కే.శ్రీనివాస్ రెడ్డి, కే.బాల్ రెడ్డి,పి.సుదర్శన్ రెడ్డి, జి.సుధాకర్ రెడ్డి,డాక్టర్ సిద్ధి రామప్ప,పాపనోళ్ల సిద్ధప్ప, మణిక్యప్పగౌడు,కాత్రే నర్సింహులు,కురువ మల్లప్ప తదితరులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

నారాయణపేట మండలం సింగారం గ్రామంలో దాదాపు రూ.15 లక్షల వ్యయంతో శ్రీ పోచమ్మ దేవాలయాన్ని నిర్మించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఆశాజనకంగా విరాళాలు ప్రజల నుంచి రావడంతో అందుకు అనుగుణంగా దేవాలయాన్ని నిర్మించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. అమ్మవారి దేవాలయాన్ని సర్వ సుందరంగా నిర్మించాలనే ప్రతిపాదన కూడా ఉంది. ఏదేమైనాప్పటికీ చాలా కాలం తర్వాత శ్రీ పోచమ్మ దేవాలయానికి మంచి రోజులు వచ్చేయని చెప్పవచ్చు. దాంతో సింగారం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# వరంగల్ ఎక్సైజ్ పోలీస్ కానిస్టేబుల్స్ అర్బన్ యూనియన్ అధ్యక్షునిగా కొమరవెల్లి లింగేశ్వర గుప్తా



హన్మకొండ (డి కె చాటింపు) ఈనెల 20 వ తేదీన జరిగిన వరంగల్ ఎక్సైజ్ పోలీస్ కానిస్టేబుల్స్ అర్బన్ యూనియన్ ఎలక్షన్స్ లో భాగంగా వరంగల్ అర్బన్ యూనియన్ అధ్యక్షుడిగా కొమరవెల్లి లింగేశ్వర గుప్తా ఎన్నికవ్వడం జరిగింది. జనరల్ సెక్రెటరీగా టి. సత్యనారాయణ, ట్రెజరర్ గా..కే సుధాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా కే ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్, గా ఎం శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ,గా పి గౌతమి జోనల్ చైర్మన్, వి కొమరయ్య,పబ్లిసిటీ సెక్రటరీగా, ప్రశాంత్ ( ఈ. నెంబర్ వన్ మెన్) సిహెచ్ రమేష్ బాబు., ఎగ్జిక్యూటివ్ జనరల్ మెంబర్ టు, గా మహిళల..లో జి స్వర్ణలత, వీరిని ఎన్నుకోవడం జరిగింది.

# శ్రీ వాసవి సేవా సమితి ట్రస్ట్ ద్వారా ఉన్నత విద్యకై ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తులు చేసుకోండి




నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 27 (డీకే చాటింపు): ఆర్థికంగా వెనుకబడిన నిజామాబాదు పట్టణ ఆర్య వైశ్యులకు ముఖ్యశీగా ప్రతిభతో ముందుకు రావాలనుకునే విద్యార్థులకు ఇంజనీరింగ్,మెడిసిన్, సి.ఏ. లాంటి ఉన్నత చదువులకుశ్రీ వాసవిసేవా సమితి ట్రస్ట్, నిజామాబాద్ నుండి ఆర్థిక సహాయం అందించ నున్నట్లు ట్రస్ట్ చైర్మన్ అర్వపల్లి పురుషోత్తం ట్రస్ట్ సభ్యులు ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ ప్రతాప్ కుమార్ తెలిపారు. విద్యే భవిష్యత్తుకి వెలుగు నిస్తుంది అనిఅన్నారు. ఆసక్తి ఉన్న పేద విద్యార్థులు దరఖాస్తులు ఆగస్టు 29 లోగా అర్వపల్లి పురుషోత్తం కార్యాలయం, రావుజీ సంగం సమీపం, నామ్ దేవ్ వాడ , నిజామాబాద్ నుండి పొందాలని అన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు సెప్టెంబర్ 3 లోగా కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కలలను ఆపకండి. మేము మీకు తోడుగా నిలుస్తాం అని ట్రస్టు సభ్యులు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు నంబర్లకు సంప్రదించాలని కోరారు 98480 72945 , 94400 90293 , 98853 93339 , 94402 11976అలాగే ఈ మహోన్నత సేవాలో భాగస్వాములు కావాలని దాతలందరిని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని మీ విరాళం ఒక విద్యార్థి భవిష్యత్తుకు కొత్త వెలుగు నింపుతుంది అని ట్రస్ట్ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో 27న ధర్నా



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 27 (డీకే చాటింపు): తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27 గురువారం రోజున ఉదయం 10 గంటలకు నిజాంబాద్ నగరంలోని ధర్నా చౌక్ లో ధర్నా చేపట్టనున్నట్లు జేఏసీ అధ్యక్షుడు సుమన్ కుమార్ తెలిపారు. టీఎన్జీవో భవన్లో మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగులకు రావలసిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని ప్రతినెల 2000 కోట్లు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు . సిపిఎస్ రద్దు చేసి వెంటనే ఓ పి ఎస్ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతేకాకుం డా ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం విధి విధానాలు అమలుచేసి తక్షణమే ఆరోగ్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. 54 అంశాలతో కూడిన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# గొంతులో ఇరుక్కున్న చాప ముల్లు ను తొలగించిన కాకతీయ గ్యాస్ట్రో అండ్ లివర్ హాస్పిటల్ డాక్టర్ నవీన్ ఆడెపు...

బెల్లంపల్లి (డీకే చాటింపు ) నెన్నెల మండలం ఆవాడం గ్రామానికి చెందిన 50 సంవత్సరాల వయసు గల వ్యక్తి భోజనం చేస్తుండగా గొంతులో చాప ముళ్ళు ఇరుక్కుని అస్వస్థతకు గురి కావడం జరిగింది వెంటనే వారి కుటుంబ సభ్యులు మంచిర్యాల లోని కాకతీయ గ్యాస్ట్రో అండ్ లివర్ హాస్పిటల్ కి తీసుకు రావడం జరిగింది డాక్టర్ నవీన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఎండోస్కోపీ ద్వారా గొంతులో ఇరుక్కున్న చాప ముళ్ళు ను అత్యంత చాకచక్యంగా బయటికి తీయడం జరిగింది దీంతో వారి కుటుంబ సభ్యులు బంధువులు ఊపిరి పీల్చు కున్నారు రోగికి ఉపశమనం లభించింది రోగి ఆరోగ్యం నిలకడగా ఉన్నందున రోగిని హాస్పటల్ నుండి డిశ్చార్జ్ చేయడం జరిగింది



# రేవంత్ లో ఫైర్ తగ్గుతుందా...



**హైదరాబాద్, :** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శైలి అనగానే ఎవరికైనా గుర్తొచ్చేది ఆయన దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే నిరంతర ఎదురుదాడి. విపక్ష హోదాలో ఉన్నా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నా ఆయన వైఖరి ఎప్పుడూ ఆఫెన్సివ్‌గానే ఉండేది. అయితే, ఇటీవల సొంత నియోజకవర్గం కొడంగల్ సమావేశాల్లోనూ, ఇతర బహిరంగ వేదికలపైనా ఆయన మాట్లాడిన మాటలు రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. కొడంగల్ సహా పలు సభల్లో తనపై కుట్రలు చేస్తున్నారని అంటున్నారు. విపక్షాలు నన్ను పని చేసుకోనివ్వాలి.. నా గొంతు నొక్కాలని చూస్తున్నారు అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలు ఆయన నిరంతర ఫైరింగ్ టోన్‌కు భిన్నంగా, ఒక రకమైన ఆవేదనను లేదా ఆత్మరక్షణ ధోరణిని ప్రతిబింబిస్తున్నాయనే అభిప్రాయం వినిపిస్తోంది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణాలను పరిశీలిస్తే.. పరిపాలనలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సవాళ్లే మొదటిది. ఎన్నికల హామీలుగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో నెరవేర్చడంలో ఎదురవుతున్న ఆర్థిక పరిమితులు, ఉపాధి హామీలు, పింఛన్ల పంపిణీపై విపక్షాల నుంచి వస్తున్న నిరంతర ఒత్తిడి ఒకవైపు కాగా హైడ్రా సృష్టించిన కలకలం, ప్రభుత్వాన్ని కొంత రక్షణత్మక వైఖరిలోకి నెట్టాయి. గడిచిన ఎనిమిది-తొమ్మిది నెలల పాలనలో ఊహించిన వేగంతో ప్రాజెక్టులు ముందుకు సాగకపోవడం, అనుకున్న స్థాయిలో నిధుల సమీకరణ కాకపోవడం వల్ల వచ్చిన అసంతృప్తి రేవంత్ రెడ్డి స్పీచ్‌లలో ప్రతిబింబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, కొడంగల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫార్మా సిటీ నిరసనలపై ప్రతిపక్షాలైన బిఆర్ఎస్ , బిజెపి సంయుక్తంగా తన రాజకీయ పునాదినే దెబ్బతీసేందుకు వ్యూహాలు రచిస్తున్నాయని సీఎం బహిరంగంగా ఆరోపించడం ఆయనలోని రాజకీయ భయాన్ని స్పష్టం చేస్తోందని విపక్ష నేతలంటున్నారు. తన సొంత నియోజకవర్గంలోనే ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని, తన పట్టును బలహీనపరిచేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయని పదేపదే అనడం పార్టీ నేతలకు కూడా ఇబ్బందికరంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణలు కూడా రేవంత్ శైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఒకవైపు ఢిల్లీ అధిష్టానం నిర్ణయాలపై ఆధారపడటం, మరోవైపు మంత్రివర్గంలోని సీనియర్ నేతల వైఖరి, అసంతృప్తుల సమన్వయం వంటి అంశాలు ఆయన స్వేచ్ఛాయుత నిర్ణయాధికారానికి అడ్డుకట్ట వేస్తున్నాయి. గతంలో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అనే రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉండటం వల్ల వ్యాఖ్యల్లో కొంత సంయమనం వహించాల్సి రావడం సహజమే అయినా.. నన్ను పని చేసుకోనివ్వడం లేదు అనే రక్షణాత్మక ధోరణి ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతోంది. రేవంత్ రెడ్డి మాటల్లో కనిపిస్తున్న ఈ హెచ్చుతగ్గులు కేవలం పాలనాపరమైన ఒత్తిడి వల్ల వచ్చినవి కావు. గ్రేటర్ ఎన్నికలు, కొడంగల్‌లో పట్టు నిలుపుకోవడం, విపక్షాల ఐక్య దాడిని తిప్పికొట్టే క్రమంలో ఆయన అమల్లోకి తెచ్చిన సెంటిమెంట్ కార్డ్ కూడా కావచ్చు. అయితే, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నాయకుడు ఆవేదన వ్యక్తపరిస్తే అది బలహీనతగా ప్రచారమయ్యే ప్రమాదం ఉంది కాబట్టి, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి తిరిగి తన మార్క్ ఆఫెన్సివ్ డెవలప్‌మెంట్ ఎజెండాతో ముందుకు వస్తారా లేక ఈ పొలిటికల్ అప్రమత్తతలోనే కొనసాగుతారా అనేది వేచి చూడాలి.

# పక్కా వ్యూహాలతో టీపీసీసీ



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ముందస్తు వ్యూహాలు, రాజకీయ ఎత్తుగడలు వేడెక్కుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పన్నుతున్న రాజకీయ వ్యూహాలను, కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సిద్ధమైంది. రాష్ట్రంలో రాజకీయ ఆధిపత్యం కోసం సాగుతున్న పోరులో బీజేపీ అవలంబిస్తున్న తీరును గమనించిన కాంగ్రెస్ నాయకత్వం, దాన్ని క్షేత్రస్థాయిలోనే ఎదుర్కొనేందుకు సమరశంఖం పూరించింది. ఇందులో భాగంగానే, న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ వేదికగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సమన్వయ కమిటీ అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించింది. పీసీసీ సమన్వయ కమిటీ ఏర్పాటైన సుమారు నాలుగు నెలల తర్వాత మొదటిసారి జరిగిన ఈ భేటీ రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో జరిగిన ఈ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, వంశీచంద్ తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. దాదాపు గంటన్నరకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా ఓటర్ల నమోదు, ఎస్ఐఆర్, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ఈ ఓట్ల తొలగింపు కుట్రను ఏకగ్రీవంగా తిప్పికొట్టాలని కమిటీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ సవరణ ప్రక్రియ రాష్ట్రంలో 50 నుండి 60 శాతం మేర పూర్తయిందని, రాబోయే రెండు మూడు రోజుల్లో మొదటి దశ పూర్తిగా ముగియనుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన ఏ ఒక్క పౌరుడూ ఓటు హక్కును కోల్పోకుండా చూసేందుకు క్షేత్రస్థాయిలో ఉన్న 36 వేల మంది బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎఫ్ఐఆర్ ప్రక్రియ ముగిసే వరకు పార్టీ ముఖ్య నేతలు, డిసిసిలు, మండల స్థాయి నాయకులు ఎలాంటి ఇతర పనులూ పెట్టుకోకుండా పూర్తిస్థాయిలో దీనిపైనే దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియలో మందకొడిగా వ్యవహరించిన కొందరు పార్టీ ఇన్చార్జులు, ఎమ్మెల్యేలు, బీఎల్ఏల తీరుపై సమావేశంలో మీనాక్షి నటరాజన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. నిర్లక్ష్యం వహించే వారిపై రివ్యూ జరిపి, పార్టీ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం కాంగ్రెస్ కఠిన వైఖరికి నిదర్శనం. పార్టీ యంత్రాంగం-ప్రభుత్వం మధ్య మెరుగైన సమన్వయం సాధించడం కోసం ప్రతి రెండు నెలలకోసారి పీసీసీ సమన్వయ కమిటీ భేటీ కావాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాబోయే ఖమ్మం-వరంగల్-నల్గొండ, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ రెండు స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా జిల్లాల ఇన్చార్జిలు, జిల్లా పీసీసీలతో కూడిన ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి నివేదికల ఆధారంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. మొత్తానికి, ఓటర్ల జాబితా పరిరక్షణ నుండి ఎన్నికల వ్యూహాల వరకు కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేయడమే కాకుండా, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నాయని స్పష్టమవుతోంది.

# నల్గొండలో కోమటి వర్గానిదే పై చేయి...



**నల్గొండ, :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్షుల మార్పు అంశం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా నల్గొండ డీసీసీ పీఠంపై జరుగుతున్న పోరు అధికార పార్టీలో అంతర్గత కుమ్ములాటలను బట్టబయలు చేస్తోంది. ప్రస్తుత అధ్యక్షుడు పున్నా కైలాష్ నేతను పదవి నుంచి తొలగించాలనే ప్రతిపాదన తీవ్ర దుమారానికి దారితీసింది. కోమటిరెడ్డి సోదరులు మొదటి నుంచి ఈయన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రోటోకోల్ వివాదం తలెత్తడం, స్థానిక కేడర్ మధ్య విభజన స్పష్టంగా కనిపించడం పార్టీలో చర్చనీయాంశమైంది. ఒకవైపు అధినేత అండదండలు ఉన్నప్పటికీ, సొంత జిల్లా మంత్రుల ఒత్తిడి కారణంగా ఈ మార్పు వ్యవహారం అత్యంత సున్నితమైన రాజకీయ అంశంగా మారింది. ఈ పరిణామం కేవలం ఒక పదవికి సంబంధించినది కాకుండా, పార్టీలో ఎవరి ఆధిపత్యం చెల్లుబాటు అవుతుందనే దానికి నిదర్శనంగా మారింది. ఒకవేళ పున్నాపై వేటు పడితే, అది సీఎం రేవంత్ రెడ్డి వర్గానికి ఎదురుదెబ్బగా భావించాల్సి వస్తుంది. కోమటిరెడ్డి బ్రదర్స్ పట్టు నెగ్గితే, అది ప్రత్యర్థి శిబిరానికి స్పష్టమైన రాజకీయ సంకేతాలను పంపుతుంది. ముఖ్యమంత్రి పూర్తి మద్దతు ఇస్తున్నప్పటికీ, మంత్రివర్గంలో చక్రం తిప్పుతున్న బలమైన మంత్రుల ఒత్తిడిని అధిగమించడం నాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయ సమీకరణాలు ఎప్పుడూ అత్యంత కీలకమైనవే కాబట్టి, ఇక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం రాష్ట్ర స్థాయిపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం సామాజిక సమీకరణాలు కావడం గమనార్హం. పున్నా కైలాష్ నేత బీసీ వర్గానికి చెందిన ప్రముఖ నాయకుడు కావడం పార్టీకి ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే కుల గణనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న తరుణంలో, బీసీ నేతను పదవి నుంచి తప్పించడం తీవ్ర విమర్శలకు దారితీసే ప్రమాదం ఉంది. త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో ఇలాంటి నిర్ణయం తీసుకుంటే, ప్రతిపక్షాలకు బలమైన అస్త్రం దొరికినట్లే అవుతుంది. కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తోందనే తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లే అవకాశం లేకపోలేదు. సామాజిక న్యాయం నినాదానికి తూట్లు పడుతున్నాయనే విమర్శలు రాకుండా ఉండేందుకు పార్టీ పెద్దలు ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్గపోరు తీవ్ర రూపం దాల్చడం, బీసీ వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం పొంచి ఉండటంతో కాంగ్రెస్ హైకమాండ్ తల పట్టుకుంటోంది. ఒకవైపు మంత్రుల పట్టుదల, మరోవైపు ఎన్నికల సమయాన సామాజిక సమీకరణాలు దెబ్బతింటాయనే ఆందోళన పార్టీలో గుబులు పుట్టిస్తున్నాయి. ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు పార్టీకి నష్టం చేకూరుస్తాయని అనుభవజ్ఞులైన నేతలు హెచ్చరిస్తున్నారు. సరిగ్గా ఎన్నికల వేళ అసమ్మతి రాగాలు పెరిగితే అది నష్టాన్ని కలిగిస్తుంది. వివాదాలను సద్దుమణిగిస్తూ, అందరినీ కలుపుకెళ్లే వ్యూహరచన చేయడంలో అధిష్టానం విఫలమైతే, అది ప్రత్యర్థులకు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుంది. ఈ సంక్లిష్ట పరిస్థితిని పార్టీ పెద్దలు ఎలా చక్కదిద్దుతారనేది అత్యంత ఆసక్తికరంగా మారింది. మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్‌లో డీసీసీల మార్పు కత్తిమీద సాములా మారింది. ఒకవైపు సొంత పార్టీ మంత్రుల ఒత్తిడి, మరోవైపు సామాజిక వర్గాల అసంతృప్తి మధ్య అధిష్టానం సతమతమవుతోంది. ఈ వివాదానికి త్వరలోనే తెరపడకపోతే, అది రాబోయే ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ శ్రేణుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించి, ఐక్యతను సాధించడంలో నాయకత్వం సఫలమవుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. ఏ నిర్ణయం తీసుకున్నా అది పార్టీ భవిష్యత్తును శాసించేదిగా ఉండనుంది. రాజకీయ విశ్లేషకులు ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

## బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్..

## టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు



**హైదరాబాద్, :** తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు 'ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్' కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


# రంగనాథ్ కు మద్దతుగా రేవంత్

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర రూపురేఖలను మారుస్తామని.. చెరువులు, ఆక్రమణలను ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హైడ్రా ను తెరపైకి తెచ్చింది. అయితే ఇప్పుడిది రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. హైడ్రాను సీఎం రేవంత్ రెడ్డి తన 'బ్రెయిన్ చైల్డ్'గా భావిస్తుంటారు. అందుకే హైడ్రా కమిషనర్‌గా సమర్థుడిగా పేరొందిన ఐపీఎస్ అధికారి రంగనాథ్‌ను నియమించి, అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపారు. అయితే, ఇటీవల హైకోర్టు రంగనాథ్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని, ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని ఆదేశించడంతో ఈ ఉదంతం ఒక్కసారిగా కీలక మలుపు తిరిగింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడినట్లే కనిపించినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఈ అంశంలో అంగుళం కూడా వెనక్కి తగ్గడానికి సిద్ధంగా లేరు. ఎలాగైనా రంగనాథ్‌నే అదే పదవిలో కొనసాగించాలనే దిశగా కాంగ్రెస్ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ప్రభుత్వ యంత్రాంగం రంగంలోకి దిగింది. అధికారుల నియామకం, బదిలీలు అనేది సంపూర్ణంగా ప్రభుత్వం పరిధిలోని అంశమని, ఇందులో కోర్టు జోక్యం సరికాదనే బలమైన వాదనను వినిపించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ నిపుణులతో వరుస సమావేశాలు నిర్వహించి లీగల్ ఆప్షన్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన నుంచి తిరిగి రాగానే దీనిపై తుది సమీక్ష నిర్వహించి, హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించేందుకు పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. కోర్టు ఆదేశాలపై స్టే తెచ్చుకోవడమే కాకుండా, రంగనాథ్ బాధ్యతలను యథాతథంగా కొనసాగించేలా న్యాయపోరాటం చేయాలని ప్రభుత్వం గట్టి పట్టుదలతో ఉంది. రాజకీయ కోణంలో చూస్తే, హైడ్రా అనేది కేవలం ఒక ప్రభుత్వ విభాగానికో లేదా ఆక్రమణల తొలగింపుకో పరిమితమైన అంశం కాదు. ఇది రేవంత్ రెడ్డి పొలిటికల్ ఇమేజ్‌తో నేరుగా ముడిపడి ఉంది.




కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి అత్యంత ఆవేశంగా, పట్టుదలతో ముందుకు తీసుకెళ్లిన ప్రాజెక్ట్ హైడ్రా. ఇప్పుడు కోర్టు ఉత్తర్వుల కారణంగా వెనకడుగు వేస్తే, అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బీజేపీలకు పెద్ద ఆయుధంగా మారుతుంది. అధికారుల నియామకంలో కోర్టుల ఆదేశాలకు తలొగ్గితే, భవిష్యత్తులో పరిపాలనాపరమైన నిర్ణయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. హైడ్రా లక్ష్యాలను నిర్భయంగా అమలు చేయడంలో రంగనాథ్ చూపిన చొరవ రేవంత్‌కు బాగా నచ్చింది. ఆయనను తొలగిస్తే పథకం వేగం మందగిస్తుందనేది సర్కార్ భయం. న్యాయస్థానాలు కోర్టు ఉత్తర్వులను గౌరవించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతుంటే, ప్రభుత్వం మాత్రం తమ పరిపాలనాధికారాలను కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు చట్టబద్ధత, కోర్టు ధిక్కరణ ఆరోపణలు, మరోవైపు రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పట్టుదల.. ఈ రెండింటి నడుమ హైడ్రా వ్యవహారం ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. డివిజన్ బెంచ్‌లో ప్రభుత్వం వినిపించే వాదనలు ఎంతవరకు నిలబడతాయి? కోర్టు రంగనాథ్ నియామకంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అనేది వేచి చూడాలి. ఏది ఏమైనా, రేవంత్ రెడ్డి తీసుకోబోయే తుది నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లోనూ, అధికారుల నియామక ప్రక్రియల్లోనూ ఒక కొత్త చర్చకు దారితీయడం ఖాయం

# లోకల్ ఎన్నికలపై విజయ్ బ్యాక్ స్టెప్



**చెన్నై, :** తమిళనాడు రాజకీయ వేదికపై విప్లవాత్మక మార్పులతో అధికారాన్ని కైవసం చేసుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్, ప్రతిపక్షాలకు చిక్కని కొత్త వ్యూహానికి తెరలేపినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో త్వరలోనే జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించడానికి ప్రభుత్వం సుముఖంగా లేదనే వార్తలు కొద్దిరోజులుగా ప్రచారంలోకి వచ్చాయి. పంచాయతీ, మునిసిపాలిటీ స్థాయిల్లో ఇప్పుడే ఎన్నికలకు వెళ్తే పార్టీకి మైలేజ్ కంటే నష్టమే ఎక్కువ జరుగుతుందనే అంచనాలతో ఎన్నికలను కనీసం ఒక ఏడాది పాటు వాయిదా వేయాలని సీఎం విజయ్ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఈ వ్యూహాత్మక వెనుకంజ వెనుక ఉన్న అసలు కారణం.. టీవీకేకి క్షేత్రస్థాయిలో ఉన్న బలహీనమైన సంస్థాగత నిర్మాణమే. అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ స్టార్ పవర్, యువత ఓట్లు , కొత్త మార్పును కోరుకున్న ఓటర్ల మద్దతుతో టీవీకే ఘనవిజయం సాధించినప్పటికీ, గ్రామ స్థాయిలో క్రియాశీలక నాయకత్వం, బూత్ స్థాయి నెట్‌వర్క్ ఇంకా పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం అధినేత ఇమేజ్, రాష్ట్రస్థాయి అంశాలు సరిపోతాయి కానీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిగా క్షేత్రస్థాయి వ్యక్తిగత పరిచయాలు, బలమైన కార్యకర్తల జాలంపైనే ఆధారపడి ఉంటాయి. ఈ సమయంలో స్థానిక పోరుకు వెళ్తే గ్రామీణ స్థాయిలో ఉన్న క్యాడర్ లోపం బయటపడే అవకాశం ఉంది. మరోవైపు, పరాజయం పాలైనప్పటికీ ఇప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, గ్రామీణ స్థాయిలో బలమైన స్థానిక బూత్ కమిటీలు కలిగిన ప్రధాన ప్రతిపక్షం డీఎంకే ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది. ఇప్పటికిప్పుడు స్థానిక ఎన్నికలు జరిగితే, తమకున్న కేడర్ బలంతో డీఎంకే క్షేత్రస్థాయిలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకవేళ ప్రతిపక్ష డీఎంకే గనుక స్థానిక పోరులో పైచేయి సాధిస్తే, టీవీకే గెలుపు కేవలం తాత్కాలిక వేవ్ లేదా హైప్ మాత్రమే.. క్షేత్రస్థాయిలో వాళ్లకు ఎలాంటి పునాది లేదు అని విస్తృతంగా ప్రచారం చేసి విజయ్ ప్రభుత్వ ఇమేజ్‌ను మొదటికే మోసం చేసేలా కౌంటర్ ఇచ్చే ప్రమాదం ఉందని అధికార పక్షం భావిస్తోంది. ఈ ముప్పును ముందుగానే గ్రహించిన సీఎం విజయ్, ముందుగా రాబోయే అసెంబ్లీ ఉపఎన్నికలపై దృష్టి సారించి, స్థానిక సంస్థల పోరును ఏడాది పాటు పక్కన పెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ లోపు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో, వార్డులో టీవీకే కమిటీలను పటిష్టం చేసి, కొత్త రక్తాన్ని నింపి, శ్రేణులకు దిశానిర్దేశం చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ స్థాయిల్లో డీఎంకేను ఢీకొట్టేలా వ్యవస్థను నిర్మించుకున్న తర్వాతే బరిలోకి దిగడం సురక్షితమని, ఆలోపు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రజల్లో మరింత ఆదరణ పెంచుకోవాలని టీవీకే నాయకత్వం భావిస్తోంది. ఎన్నికలను వాయిదా వేసే యోచన వెనుక భయం కంటే రాజకీయ చాతుర్యమే ఎక్కువగా కనిపిస్తోందని అంటున్నారు. ప్రత్యర్థుల బలమైన ప్రాంతంలో తొందరపడి అడుగుపెట్టి దెబ్బతినడం కంటే, సమయం తీసుకుని సొంత సైన్యాన్ని సిద్ధం చేసుకున్నాకే యుద్ధానికి వెళ్లడం విజయ్ రాజకీయ పరిణతికి నిదర్శనంగా మారింది.

# మండలి కోసం వడపోతలు షురూ




విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ శాసన మండలి లో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పందుల రవీంద్ర , జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ( ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది. ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు. ఆమె పార్టీ తరఫున చురుకుగా వ్యవహరిస్తున్నప్పటికీ, మండలిలో మరింత దూకుడుగా వాదించే నాయకులు అవసరమనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి బలమైన వాక్చాతుర్యం కలిగిన, ప్రతిపక్షంపై సమర్థంగా ఎదురుదాడి చేయగల నేతలను ఎంపిక చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, భవిష్యత్ రాజకీయ అవసరాలు వంటి అంశాలను కూడా టీడీపీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలుస్తోంది. పార్టీకి విధేయతతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం కూడా ఉంది. మొత్తంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కేవలం నామినేషన్ ప్రక్రియ మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ వ్యూహాలకు కూడా కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. అందుకే తుది ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శాసన మండలిలో ఖాళీ అయిన.. రెండు స్థానాలను భర్తీ చేసే విషయంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు మౌనంగా ఉ న్నారు. ఈ రెండు సీట్లు కూడా గవర్నర్ కోటాలో భర్తీ చేసేవే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి సర్కారుకు గవర్నర్ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి పెద్దగా ఎలాంటి ఇబ్బందులు ఉండే అవకాశం లేదు. దీంతో ఎవరిని ఎంపిక చేసినా ఇట్టే వారు మండలిలో కూర్చుంటారు. దీంతో నాయకులు మరిన్ని ఆశలు పెట్టుకున్నారు. గతంలో తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎంపిక వివాదం అయింది. సుప్రీంకోర్టు వరకు సాగింది. అయితే.. ఇలాంటి వివాదాలు ఏపీలో కనిపించడం లేదు. దీంతో బాబు నిర్ణయమే ఫైనల్ అన్నట్టుగా ఉంది. ఇది నాయకుల్లో మరిన్ని ఆశలు రేకెత్తిస్తోంది. అయితే.. తాజాగా సీనియర్ నాయకులతో సచివాలయంలో చంద్రబాబు భేటీ అయినా.. ఈ విషయంపై ఆయన ఎక్కడా స్పందించలేదు. ఇది మరింతగా నాయకుల్లో టెన్షన్ పెంచుతోంది. ఇటీవల రాజ్యసభ ఎన్నిక ల సమయంలోనూ టీడీపీ కోటాలో ఎంపిక చేసేవారి పేర్లను ఇంతే గోప్యంగా ఉంచారు. ఫలితంగా ఆశలు పెట్టుకున్నవారు.. చివరి వరకు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎంపిక ప్రక్రియ అయిపోయిన తర్వాత..ఆశలు పెట్టుకున్న అందరూ నిరుత్సాహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా బాబు బాంబు పేలుస్తారా? అనేది చర్చకు దారితీసింది. అలా వద్దని.. సడెన్‌గా పేర్లను వెల్లడిస్తే.. కేడర్‌లో చులకన అవుతున్నామని ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉ ంటామని, అయితే.. ఆ నిర్ణయమేదో సాధ్యమైనంత త్వరగా ప్రకటిస్తే.. కేడర్‌ను సంతృప్తి పరిచేందుకు.. తమ ఫ్యామిలీలను సంతృప్త పరిచేందుకు కూడా అవకాశం ఉంటుందని అంటున్నారు. మొత్తంగా ఈ విషయంపై టీడీపీలో చర్చ సాగుతోంది. కొందరు నాయకులు వస్తుందో రాదో అన్న బెంగతో తరచుగా ఫోన్లు కూడా చేస్తున్నారు. మరి చంద్రబాబు ఎ వరిని కరుణిస్తారో చూడాలి. ఏదేమైనా సడెన్‌గా కాకుండా ముందుగానే ప్రకటించాలని నాయకులు కోరుతున్నారు.

# వడివడిగా హైకోర్టు బెంచ్ ఏర్పాట్లు




కర్నూలు, : రాయలసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి ఆకాంక్ష అయిన కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన తీవ్ర ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. 90 రోజుల్లో కర్నూలులో హైకోర్టు బెంచ్ అందుబాటులోకి వస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, ఒక రాష్ట్రంలో లేదా ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం అనేది కేవలం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోని అంశం మాత్రమే కాదు. దీనికి సుదీర్ఘమైన రాజ్యాంగపరమైన, న్యాయపరమైన, పరిపాలనాపరమైన ప్రక్రియలు అవసరమవుతాయి. అందుకే 90 రోజుల గడువు సాధ్యమేనా? అసలు బెంచ్ ఏర్పాటు వెనుక ఉండే చట్టపరమైన క్రమం ఏమిటి? సాధారణంగా ఏదైనా రాష్ట్రంలో హైకోర్టుకు చెందిన ఒక ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలంటే ది స్టేట్ హైకోర్ట్స్ యాక్ట్ లేదా సంబంధిత పునర్వ్యవస్థీకరణ చట్టాల నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొదట రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించాలి. అనంతరం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలోని ఫుల్ కోర్ట్ ముందుకు ఈ ప్రతిపాదన వెళుతుంది. హైకోర్టు ఫుల్ కోర్ట్ ఈ బెంచ్ ఏర్పాటుకు సాంకేతిక, మౌలిక వసతుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి పూర్తి స్థాయిలో ఆమోదం తెలపాల్సి ఉంటుంది. హైకోర్టు ఫుల్ కోర్ట్ అంగీకారం తెలిపిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కేంద్ర న్యాయ శాఖ కు నివేదిస్తుంది. కేంద్ర ప్రభుత్వం దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి , సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలనకు పంపుతుంది. సుప్రీంకోర్టు సీజేఐ , కొలీజియం నుండి అనుమతి లభించిన తర్వాత మాత్రమే, కేంద్ర హోంశాఖ భారత రాష్ట్రపతి ఆమోదం కోసం ఫైలును పంపుతుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 214, సంబంధిత నిబంధనల ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చట్టబద్ధంగా రూపుదిద్దుకుంటుందిరాజ్యాంగపరమైన ఈ ప్రక్రియతో పాటు క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన అత్యంత ప్రధానమైనది. బెంచ్ నిర్వహణకు అవసరమైన తాత్కాలిక లేదా శాశ్వత భవనాలు, న్యాయమూర్తులకు నివాస సదుపాయాలు , కోర్టు హాళ్లు, రిజిస్ట్రీ సెక్షన్లు, అడ్వకేట్ రూమ్‌లు, పోలీస్ బందోబస్తు , డిజిటల్ నెట్‌వర్కింగ్ వంటి మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయాలి. వీటితో పాటు అమరావతిలోని ప్రధాన హైకోర్టు నుండి కర్నూలు బెంచ్‌కు ఏ ఏ జిల్లాల కేసుల అధికార పరిధి బదిలీ చేయాలనే దానిపై న్యాయ పరిపాలనా పరమైన స్పష్టత రావాల్సి ఉంటుందిఇంతటి సుదీర్ఘ ప్రక్రియ ఉన్నప్పటికీ మంత్రి నారా లోకేష్ 90 రోజుల గడువు విధించడం వెనుక కూటమి ప్రభుత్వ వ్యూహాత్మక ఆలోచన ఉందని రాజకీయ, న్యాయ విశ్లేషకులు భావిస్తున్నారు. కర్నూలులో ఇప్పటికే లోకాయుక్త వంటి న్యాయ సంస్థలకు ఉద్దేశించిన భవనాలు సిద్ధంగా ఉన్నందున, ప్రాథమికంగా తాత్కాలిక భవనంలో బెంచ్ కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటును ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రంతో మంచి సఖ్యతతో ఉన్నందున, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం త్వరితగతిన పూర్తి చేసి, సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేల అనుమతుల ప్రక్రియను ఫాస్ట్ ట్రాక్ చేయాలనేది లోకేష్ వేసిన కచ్చితమైన ముందస్తు ప్రణాళికగా కనిపిస్తోంది. గతంలో బెంచ్ ఏర్పాటు ప్రక్రియలపై న్యాయవాదుల నిరసనలు, వినతులు జాప్యానికి కారణమైన ఆధారాలు ఉన్నాయి. అందువల్ల, 90 రోజుల్లో అన్ని రాజ్యాంగ ఆమోదాలు, రాష్ట్రపతి ఉత్తర్వులు పొందడం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో పరిపాలనాపరమైన క్లియరెన్సులను వేగవంతం చేస్తే, నిర్ణీత సమయంలో లేదా దానికి సమీప కాలంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ కల సాకారమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# భువనేశ్వరి ఆగ్రహం...



తిరుపతి, : నారా భువనేశ్వరి గత మూడు రోజుల నుంచి కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అయితే నారా భువనేశ్వరి ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడరు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు దాదాపు నాలుగు సార్లు ఎన్నికయినప్పటికీ నారా భువనేశ్వరి పాలన వ్యవహారాల్లోనూ, రాజకీయాల్లోనూ ఆమె జోక్యం కనపడదు. కేవలం కుటుంబ బాధ్యతలతో పాటు తాను నిర్వహిస్తున్న హెరిటేజ్ వంటి పరిశ్రమలకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే చూస్తున్నారు. నారా భువనేశ్వరి పక్కా బిజినెస్ ఉమెన్. అయితే ఎన్నికల సమయంలో మాత్రం కేవలం కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారు. అంతే తప్ప ఎటువంటి రాజకీయ వ్యవహారాలను నారా భువనేశ్వరి పట్టించుకోరు... నారా భువనేశ్వరిలో కోపం కనిపించదు. మృదుస్వభావి. అందరినీ నవ్వుతూ పలకరిస్తారు. అమ్మగా ఆమెను ఆప్యాయతను పంచుతారు. అలా చంద్రబాబుతో సమానంగా కుప్పం నియోజకవర్గ ప్రజలకు చేరువయ్యారు. నారా భువనేశ్వరి మాత్రమే కాదు లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి కూడా రాజకీయాలను అస్సలు పట్టించుకోరు. వారు కుటుంబం, వ్యాపారాలకే పరిమితమై హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అలాంటి నారా భువనేశ్వరి కి కోపం వచ్చింది. ఒక్కసారిగా ఆవేదన ఉప్పొంగింది. కుప్పం నియోజకవర్గం పర్యటనలో ద్రౌపది చిత్రపటాన్ని చూసి నారా భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు. కుప్పం పర్యటనలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నారా భువనేశ్వరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనను అసెంబ్లీలో అవమానించారని... అసెంబ్లీలో తనను నిండు సభలో అవమానించారని, ఆ సంఘటన మహాభారతంలో ద్రౌపది వస్త్రాపహరణాన్ని తలపించిందని కంటతడి పెట్టుకున్నారు. కౌరవులు సభలో ద్రౌపదిని అవమానించినట్టుగానే, గత పాలకులు రాజకీయ లబ్ధి కోసం తన చరితను హేళన చేశారని మండిపడ్డారు. తన భర్తకు తానేంటో తెలుసునని, తన భర్త చంద్రబాబుకు బాగా తెలుసునని , ఏ మహిళపై వ్యక్తిగత విమర్శలు చేసే హక్కు ఎవరికీ లేదని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. రాజకీయాల్లో పోరాటాలు ఎవరిపై చేయాలన్నా చేసుకోవచ్చు కానీ, ఇళ్లలోని స్త్రీలను లాగి అవమానించడం అత్యంత హేయమని ఆవేదన వెలిబుచ్చారు. మగ అహంకారంతో గత ప్రభుత్వంలో వ్యవహరించి తనను హేళన చేయడాన్ని ఆమె గుర్తు చేసుకుని బాధపడ్డారు. ఇది రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది.

# రంగంలోకి రోజా



**తిరుపతి,** : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక కొత్త పరిణామం పార్టీ శ్రేణులకు గందరగోళపరుస్తోంది. ముఖ్యంగా చిత్తూరు జిల్లా రాజకీయాల్లో ఒక కుదుపు. మాజీ మంత్రి ఆర్కే రోజా మళ్లీ యాక్టివ్ కావడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. ఆమె సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. ఆమెను పక్కనపెట్టి బీసీ నేతకు అవకాశం ఇస్తారని ఇప్పటివరకు ప్రచారం జరిగింది. ఈ విషయంపై పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు. నగిరి నియోజకవర్గంలో రోజా అభ్యర్థిత్వం మార్పు చేయాలని ఆయన కోరుతూ వచ్చారు. ఎందుకంటే రోజా ఉంటే పెద్దిరెడ్డికి ఇబ్బందికరమే. ఒకవేళ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీనియర్ మంత్రిగా పెద్దిరెడ్డి ఉంటారు. అదే జిల్లాలో రోజా మంత్రిగా ఉంటే తనకు ఇబ్బందికరమని పెద్దిరెడ్డికి తెలుసు. అందుకే మొన్నటి ఎన్నికల్లో రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు పెద్దిరెడ్డి. కానీ జగన్ చివరి నిమిషంలో ఆమెకు చాన్స్ ఇచ్చారు. ఈసారి ఆమెను తప్పిస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. కానీ ఇప్పుడు రోజాను మళ్ళీ తెరపైకి తేవడంతో పెద్దిరెడ్డి తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలుస్తోంది. ఇటీవల పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి బిజెపిలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. దానికి కారణం లేకపోలేదు. జగన్ స్థాయిలో పెద్దిరెడ్డి ఫ్యామిలీని టార్గెట్ చేసుకుంది కూటమి ప్రభుత్వం. అయితే ఇంతవరకు జగన్మోహన్ రెడ్డిని టచ్ చేయలేదు కానీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు మద్యం కుంభకోణంలో. అయితే ఈ పరిణామాలతో తీవ్ర కలత చెందారు పెద్దిరెడ్డి. మరోవైపు మద్యం కుంభకోణంలో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న సమయంలో పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కనీసం జగన్మోహన్ రెడ్డి పరామర్శించిన దాఖలాలు లేవు. అప్పటినుంచి ఏర్పడిన గ్యాప్ అలానే విస్తరించింది. ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై అటవీ భూముల వ్యవహారం, ఆపై రెవెన్యూ రికార్డుల దహనం కేసు వెంటాడుతోంది. ఇన్ని అవమానాలు పడి జగన్మోహన్ రెడ్డి కోసం పార్టీలో ఉండాలా.. ఆపై తన ప్రత్యర్థి రోజాను ప్రోత్సహించడం ఎంత మాత్రం మింగుడు పడడం లేదు పెద్దిరెడ్డికి. అందుకే బిజెపిలోకి వెళ్లిపోవాలన్న నిర్ణయానికి ఆయన వచ్చినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు రోజా. ఆమెకు నగిరి టిక్కెట్ ఇచ్చేందుకు జగన్ వెనుకడుగు వేస్తున్నారు అన్న ప్రచారం నేపథ్యంలోనే ఆమె చెన్నైలో ఉండిపోయారన్న టాక్ నడిచింది.. క్రమేపీ ఆమె వైసీపీకి గుడ్ బై చెబుతారని కూడా ప్రచారం సాగింది. కానీ ఉన్నట్టుండి ఆమెను తిరిగి చిత్తూరు రాజకీయాల్లోకి తేవడం.. మరింత స్వేచ్ఛ ఇవ్వడం హాట్ టాపిక్ అవుతోంది. పెద్దిరెడ్డి పై ప్రోత్సహించేందుకే జగన్ ఆమెను తీసుకొచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఒకవేళ బిజెపిలోకి పెద్దిరెడ్డి ఫ్యామిలీ వెళితే రోజా ఇప్పుడు ప్రత్యామ్నాయంగా చిత్తూరు జిల్లాలో నాయకత్వ బాధ్యతలు చూస్తారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# వైసీపీలో సాహూ ఆన్ డ్యూటీ..

**విజయవాడ,** : వైసీపీ అధినేత వైఎస్ జగన్ వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తను మార్చినట్లు తెలిసింది. కపిల్ సాహును ఆయన నియమించుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జగన్ పర్యటనలను డిజైన్ చేయడంతో పాటు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నివేదికలను కపిల్ సాహు టీం జగన్ కు అందిస్తున్నట్లు సమాచారం. అందుకే జగన్ ఈసారి ఎన్నికల్లో తమదే గెలుపు అన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. కపిల్ సాహు టీం ఇప్పటికే ఏపీ రాజకీయాలపై ఫోకస్ పెట్టిందని అంటున్నారు. జగన్ ఎక్కడకు వెళ్లినా విపరీతమైన జనం రావడం, టూర్ ఆలస్యమవ్వడం వ్యూహకర్త వ్యూహంలో భాగమేనని అంటున్నారు. అయితే ఈ పేరు అధికారికంగా బయటకు రాకపోయినా అనధికారికంగా కపిల్ సాహు డ్యూటీలోకి దిగినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. టీవీకే అధినేత విజయ్ ఎన్నికల వ్యూహకర్త గా కపిల్ సాహు వ్యవహరించారు. ఆయన ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బృందంలో పనిచేసి, ఆ తర్వాత సొంతంగా 'పొలిటికల్ కన్సల్టింగ్ డొమైన్' అనే సంస్థను ఏర్పాటు చేసి విజయ్ పార్టీ టీవీకే విజయం కోసం పనిచేశారు. తొలిసారి విజయ్ ను ముఖ్యమంత్రి పీఠం పై కూర్చోబెట్టడంలో కపిల్ సాహు కీలకంగా వ్యవహరించారు. తక్కువ సీట్లు వచ్చినప్పటికీ కపిల్ సాహు టీం సోషల్ మీడియాలో డ్రైవ్ చేయడం, విజయ్ కు అనుకూలంగా మార్చడంలో సక్సెస్ అయ్యారు. ఇదే విషయాన్ని వైసీపీ అధినేత జగన్ గుర్తించి ఆయనను తనకు 2029 ఎన్నికల వ్యూహకర్తగా ఉండాలని కోరినట్లు తెలిసింది. దీంతోకపిల్ సాహు ఇందుకు అంగీకరించినట్లు తెలసింది. ఇప్పటికే కపిల్ సాహు టీం జగన్ వ్యవహారాలను పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతతిన్నాయి. ప్రశాంత్ కిషోర్ సంస్థ ఐ ప్యాక్ లో పనిచేసిన అనుభవంతో,డాటా విశ్లేషణ, ప్రచార ప్రణాళికలు రూపొందించడంలో కపిల్ సాహు టీంకు మంచి పేరు ఉండటంతో జగన్ దృష్టిలో పడ్డారు. తనకు ప్రధాన మీడియా వ్యతిరేకం కావడం, డిజిటల్ ప్రచారంపై ఎక్కువగా ఆధారపడి రావాల్సి ఉండటంతో జగన్ కపిల్ సాహును ఎన్నికల వ్యూహకర్తగా ఎంచుకున్నారంటునినారు. తాను నేరుగా ఎక్కువ మీడియా సమావేశాల్లో పాల్గొనకపోయినా, సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి వెళ్లేలా పటిష్టమైన వ్యూహాన్ని అమలు చేయడం, సంక్షోభ సమయాల్లో సమన్వయం, ప్రచార సరళిని నిర్వర్తించడంలో కపిల్ సాహు బృందం కీలక పాత్ర పోషించనుందని చెబుతున్నారు. మరి కపిల్ సాహు ఎంత మేరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# ఫుల్ రేంజ్ లో లోకేష్ పాలిటిక్స్




**విజయవాడ,** : మంత్రి నారా లోకేష్.. ఫుల్ రేంజ్‌లో తన రాజకీయాలను విస్తరిస్తున్నారు. ఇటీవల కాలంలో పార్టీపై ఆయ న పట్టు పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు సక్సెస్ అవుతున్నాయి. నియోజకవర్గాలు, జిల్లాలు.. ఇలా ఎక్కడ ఎప్పుడు ఏది అవసరమో గుర్తించి.. దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ఒకవైపు పాలన చూసుకుంటూ.. మరోవైపు.. పార్టీ పనుల్లోనూ బిజీబిజీగా గడుపుతున్నారు. తాజాగా కర్నూల్లో నిర్వహించిన సమావేశం లోకేష్ దూకుడుకు పక్కా రియాక్షన్ ఇచ్చింది. =పార్టీ కార్యక్రమాలకు ఇటీవల కాలంలో దూరంగా ఉంటూ వచ్చిన వారు కూడా.. తాజాగా లోకేష్ వస్తున్నారని తెలిసిన వెంటనే నాయకులు క్యూకట్టారు. అప్పటి వరకు ఉన్న విభేదాలను కూడా కొందరు నాయకులు దూరం పెట్టి చేతులు కలిపారు. లోకేష్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు భేషజాలకు పోకుండా చేతు లు కలిపారు. ఇది.. పార్టీలో ఐక్యతకు నిదర్శనంగా మారిందని సీనియర్లు చెబుతున్నారు. నిజానికి కొన్నాళ్లుగా కర్నూలు తమ్ముళ్ల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ం. నిజానికి టీడీపీలో తరం మారుతున్న సంధికాలంలో నాయకుల పరిస్థితి.. అధిష్టానం ఆలోచనలు వంటివి ప్రత్యేకంగా చర్చకు వస్తున్నాయి. చంద్రబాబుకు లోకేష్‌కు మధ్య వ్యత్యాసం.. దూకుడు వంటివి నాయకుల మధ్య ఆలోచనలను మారుస్తున్నాయి. చంద్రబాబు అయితే.. చెప్పింది వింటారు.. బుజ్జగిస్తారు.. సమయం ఇస్తారు.. అనే భరోసా ఉంటుంది. దీంతో తప్పులు చేసిన నాయకులు కూడా వివరణ, విచారణలతో ఏదో ఒకరకంగా బయట పడుతున్నారు.కానీ, లోకేష్ విషయానికి వస్తే.. ఆయన దగ్గర ఇలాంటి కుదరడం లేదు. దీనికి అనేక ఉదాహరణలు కూడా ఉన్నాయి. మైలవరం నుంచి పెనమలూరు వరకు.. పలు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న వివాదాలను లోకేష్ తనదైన శైలిలో పరిష్కరించారు. ఆయనేమీ సాగదీత ధోరణికి చాన్స్ ఇవ్వరు. ఫటాఫట్.. అన్నట్టు గా నాయకులతో మొహంమీదే మాట్లాడేస్తున్నారు. దీంతో నాయకుల మధ్య ఐక్యత పెంచేందుకు.. పార్టీని లైన్‌లో పెట్టేందుకు ఈ పరిణామాలు దోహదపడుతున్నాయి. ఇదే ఇప్పుడు కర్నూలులో నాయకులు తిరిగి కలుసుకునేందుకు అవకాశం కల్పించిందని అంటున్నారు.

# వీర మహిళలకు పెద్ద పీట....

**కాకినాడ,** : జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయకపోవడంతో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యవర్గాన్ని అప్పట్లో రద్దు చేశారు. ఇప్పుడు దాదాపు అన్ని పదవులు రద్దయ్యాయి. అలాగే పార్టీ అధికార ప్రతినిధులుగా మహిళలకే చోట కల్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి

# భోగాపురంపై క్రెడిట్ వార్...



**విజయనగరం,** : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేళ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రెడిట్ వార్ నడుస్తోంది. ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ కోసం అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. భోగాపురం క్రెడిట్ తమకే దక్కుతుందని మాజీ సీఎం జగన్ అంటే.. కూటమికే క్రెడిట్ ఇవ్వాలని సీఎం చంద్రబాబు అంటున్నారు. ఈ ఇద్దరిలో భోగాపురం క్రెడిట్ ఎవరిది?..విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమైంది. ఆగస్టు 1న ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమంతో ఉత్తరాంధ్రలో పండగ వాతావరణం కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ ఎవరికి దక్కుతుందనే అంశం తెరపైకి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ ఇవ్వాలని జగన్ అంటుంటే.. కూటమి ప్రభుత్వానికే క్రెడిట్ దక్కుతుందని అధికార పార్టీలు అంటున్నాయి. భోగాపురం విమానాశ్రయం క్రెడిట్‌ను చోరీ చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. తాను ఏమీ చేయకపోయినా కీర్తి తనకే దక్కాలంటూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని పనులు ఓ కొలిక్కి తీసుకొచ్చామన్నారు.అయితే అసలు ఈ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది తామేనని చంద్రబాబు అంటున్నారు. కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చి భూసేకరణ ప్రారంభించి శంకుస్థాపన చేశామన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 31 నెలల రికార్డు సమయంలో పూర్తి చేసిన ఘనత తమకు దక్కుతుందన్నారు. ఈ ఇద్దరి వాదనలు పక్కన పెడితే.. అసలు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు బీజం ఎప్పుడు పడింది?.. 2016లో ప్రతిపాదనల దగ్గర నుంచి 2026 ప్రారంభోత్సవం వరకు ఏ ప్రభుత్వ హయాంలో ఏ పనులు జరిగాయో తెలుసుకుందాం..

2014 నుంచి 2019 వరకు ఏం జరిగింది?

రాష్ట్ర విభజన తర్వాత 2014 నుంచి విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్‌లో కీలకంగా మారింది. సాగరతీర నగరం పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. అక్కడ ఉన్న విమానాశ్రయం రక్షణ శాఖ ఆధీనంలో ఉంది. ఈ విషయాన్ని గమనించి అప్పటి చంద్రబాబు ప్రభుత్వం.. ఉత్తరాంధ్రలో మరో విమానాశ్రయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భావించింది. 2016లో మరో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కొత్తగా ప్లాన్ చేస్తున్న ఎయిర్‌పోర్ట్ విశాఖపట్నానికి సమీపంలో ఉంటే బావుంటుందని భావించారు.. అందుకే భోగాపురంలో నిర్మించాలని ప్రతిపాదించగా కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. అదే ఏడాది కేంద్ర పౌర విమానయాన శాఖ నుంచి టెక్నికల్, సైట్ అనుమతులు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు 15,000 ఎకరాల భూమిని సేకరించాలని భావించారు.. కానీ 2,700 ఎకరాలకు తగ్గించి భూసేకరణ ప్రారంభించారు. 2019 ఫిబ్రవరి 14న చంద్రబాబు చేతుల మీదుగా ఎయిర్‌పోర్ట్ కోసం శంకుస్థాపన చేశారు. 2019 ఏప్రిల్ నెలలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చింది. 2019-2024 మధ్య ఏం జరిగింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణకు సంబంధించి అంశాలపై ఫోకస్ పెట్టింది. కోర్టు వివాదాలు, కేసుల్ని పరిష్కరించింది.. ఇందుకోసం భూసేకరణను 2200 ఎకరాలకు కుదించింది. భూ నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ కాలనీలు నిర్మించి పునరావాసం కల్పించారు. అనంతరం భోగాపురం విమానాశ్రయం పనులకు సంబంధించి జీఎంఆర్ సంస్థతో కన్సెషన్ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన ఎన్వోసీలు సహా మిగిలిన అనుమతుల్ని పొందారు. 2023 మే 3న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన (రెండోసారి) చేశారు. అలాగే విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వేగంగా చేరుకునేలా 77 మీటర్ల వెడల్పుతో, రూ. 6,300 కోట్ల ఖర్చుతో 55 కి.మీ. మేర ఆరు లేన్ల హైవేను కేంద్రం ప్రకటించింది. 2023 నవంబర్‌లో రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్ పనులు ఊపందుకున్నాయి. అయితే 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2024-2026 హయాంలో ఏ పనులు చేశారు 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం విమానాశ్రయం పనులపై ఫోకస్ పెట్టారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన రామ్మోహన్ నాయుడు పౌర విమానయాన శాఖ మంత్రి కావడంతో పనుల్లో వేగం పెరిగింది. ఏటీసీ టవర్, అప్రోచ్ రోడ్లు, ఇంటర్నల్ వర్క్స్, సాంకేతిక పనులు ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా స్వయంగా అక్కడ పనుల్ని పరిశీలించారు. 2024లో రన్‌వే, ట్యాక్సీవేలు, అప్రాన్ పనులు, టెర్మినల్ బిల్డింగ్ పనులు వేగవంతం చేశారు. ఎయిర్‌పోర్ట్‌లోని ప్యాసింజర్ టెర్మినల్ బిల్డింగ్, కార్గో కాంప్లెక్స్, ఐరన్ స్ట్రక్చర్ పనులు పూర్తయ్యాయి. 2024లో ఈ విమానాశ్రయానికి కూటమి ప్రభుత్వం మన్యం వీరుడు 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' గా పేరుపెట్టింది. అలాగే ఎయిర్‌పోర్టుకు జాతీయ రహదారి నుంచి అనుసంధానించే అప్రోచ్ రోడ్ల పనులు మొదలుపెట్టారు. 2025లో టెర్మినల్ లోపల బ్యాగేజ్ హ్యాండ్లింగ్ సిస్టమ్స్, సెక్యూరిటీ స్కానింగ్, ఆటోమేటెడ్ వ్యవస్థలకు సంబంధించిన పనులు పూర్తి చేశారు. అలాగే ఏటీసీ టవర్ నిర్మాణం ముగిసింది.. అక్కడ అవసరమైన రాడార్, కమ్యూనికేషన్ సిగ్నల్ పరికరాలను అమర్చారు. 2025లో మొదటిసారి తేలికపాటి విమానం సాయంతో ట్రయల్ రన్ పూర్తిచేసి.. ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు అవసరమైన రోడ్ల పనులు కూడా చేపట్టారు. 2026 జనవరి 4న భోగాపురం ఎయిర్‌పోర్ట్ రన్‌వేపై తొలి వ్యాలిడేషన్ ఫ్లైట్ (ట్రయల్ రన్) విమానం ల్యాండ్ అయ్యింది. అంతేకాదు ఆఉఅం (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) నుంచి అవసరమైన ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు సేఫ్టీ, ఫైర్, పర్యావరణ అనుమతులు వచ్చాయి. అలాగే ఎయిర్‌పోర్ట్ లోపల ఉత్తరాంధ్ర సంస్కృతి ప్రతిబింబించేలా ఇంటీరియర్ ఆర్ట్ వర్క్స్ పనులు పూర్తి చేశారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేషనల్ హైవేను కలిపే ముఖ్యమైన ఫ్లైఓవర్ పనులు పూర్తి చేశారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం క్రెడిట్ ఎవరిది అనే చర్చను పక్కన పెడితే.. అటు వైఎస్సార్‌సీపీ, ఇటు కూటమి ప్రభుత్వాలు ఈ ప్రాజెక్ట్‌లో కీలకపాత్ర పోషించాయి. 2016లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ఎయిర్‌పోర్ట్‌కు బీజం పడింది. ప్రాజెక్ట్ ఆలోచన, ప్రతిపాదనతోపాటు కేంద్రం అనుమతులు సాధించింది చంద్రబాబు హయాంలోనే. అలాగే పనులను వేగవంతం చేసి, ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసింది కూడా కూటమి ప్రభుత్వం హయాంలోనే. అయితే జగన్ హయాంలో భూ వివాదాలు, కోర్టు కేసులను పరిష్కరించారు. జీఎంఆర్‌తో ఒప్పందం చేసుకొని భూమిని అప్పగించారు. రన్ వే నిర్మాణం, గ్రౌండ్ లెవలింగ్ లాంటి పనులు వైసీపీ హయాంలోనే మొదలయ్యాయి. విజన్, పనులను వేగవంతంగా పూర్తి చేసిన విషయంలో క్రెడిట్ టీడీపీది కాగా.. భూసమస్యల పరిష్కారం, కన్సెషన్ ఒప్పందం విషయంలో క్రెడిట్ వైఎస్సార్‌సీపీకి ఇవ్వొచ్చు. అంటే భోగాపురం క్రెడిట్ ఈ రెండు పార్టీలదీ.

# అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదా





**విజయవాడ,** : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టుల పురోగతిపై ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. అమరావతి అంటే కేవలం 29 గ్రామాల సముదాయం మాత్రమే కాదు.. విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానమైన సమగ్ర బృహత్ రాజధాని ప్రాంతం అంటూ చంద్రబాబు ఇచ్చిన స్పష్టత, అమరావతి బ్రాండ్‌ను పునర్నిర్మించే వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోంది. విజయవాడ- గుంటూరు-అమరావతిలను కలిపి ఒక మెగా మెట్రోపాలిటన్ రీజియన్‌గా తీర్చిదిద్దడమే ఏపీ భవిష్యత్ ఆర్థిక, సామాజిక దిశను నిర్దేశించే అసలైన మాస్టర్ ప్లాన్ అని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఈ ప్రకటన వెనుక విస్తృతమైన రాజకీయ, నరేటివ్ పోరాటం దాగి ఉంది. గత కొద్దికాలంగా అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను తగ్గించేందుకు ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నిరంతరం కౌంటర్ నెరేటివ్‌ను నడుపుతోంది. జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మావిగన్‌లో మ అంటే మచిలిపట్నం..మిగతా రెండు విజయవాడ, గుంటూరు. ఇప్పుడు చంద్రబాబు చెప్పిన దాంట్లో మచిలీపట్నం లేదు. మిగతా అంతా సేమ్. మాది విజన్, మీది కేవలం 29 గ్రామాల రియల్ ఎస్టేట్ మోడల్ అని చిత్రీకరించే ప్రయత్నం చేయడం ద్వారా రాజధానిపై ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైఎస్సార్సీపీ ప్రధాన రాజకీయ వ్యూహంగా మారింది. దీనికి చెక్ పెడుతూనే, సాధారణ ప్రజల్లో ఉన్న సంకోచాలను తొలగించేందుకు చంద్రబాబు ఈ త్రివేణీ సంగమం ఫార్ములాను తెరపైకి తెచ్చారు. కేవలం 29 గ్రామాలలోని కోర్ క్యాపిటల్ ఏరియానే రాజధానిగా ప్రచారం కావడం వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్ర లేదా పల్నాడు ప్రజల్లో ఇది అందరి రాజధాని కాదు అనే భావన కలిగే ప్రమాదం ఉంది. అందుకే, విజయవాడ, గుంటూరు నగరాల ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను అమరావతితో ఐక్యపరిచి, 80 లక్షలకు పైగా జనాభాను కవర్ చేసే ఒక విశ్వనగరంగా డెవలప్ చేస్తామని చెప్పడం ద్వారా ఈ ప్రాజెక్టుకు ప్రాంతీయ ఆమోదాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. రూ.50,999 కోట్ల విలువైన 95 మౌలిక వసతుల ప్రాజెక్టులతో అమరావతిలో పనులు పునఃప్రారంభమైన వేళ, ప్రతినెల కనీసం 7.92 శాతం పురోగతి సాధించాలని చంద్రబాబు క్షేత్రస్థాయి అధికారులకు నిర్దేశించిన గడువు కేవలం నిర్మాణ వేగాన్ని సూచించడమే కాకుండా.. పనులను వేగవంతం చేసి స్పీడ్, క్వాలిటీ, డెలివరీ సూత్రంతో ప్రతిపక్షాల నోళ్లు మూయించాలనే పట్టుదలను ప్రతిబింబిస్తోంది. ప్రతిపక్షాలు ఇది సాధ్యం కాని కల, కేవలం భూముల ప్రకటనలు మాత్రమే అని విమర్శిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఇది అమరావతి విజన్ 2.0 అని గట్టిగా నమ్ముతోంది. మరోవైపు, వైఎస్సార్సీపీ ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. జగన్ చెప్పిన మావిగన్ రూట్‌లోకే చంద్రబాబు వస్తున్నారని జగన్ విజనరీ అంటున్నారు. ఇప్పుడు అమరావతి అంటే 29 గ్రామాలు కాదని, విజయవాడ-గుంటూరుతో పాటు మచిలీపట్నాన్ని కూడా కలపాల్సిందే అని వైసీపీ సోషల్ మీడియా విభాగాలు ప్రచారం వేగవంతం చేశాయి. అంటే ఎలా చూసినా అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సీఆర్డీఏ గ్రామీణ పరిధులను, మచిలీపట్నం పోర్ట్ కనెక్టివిటీని తెరపైకి తెస్తూ.. అమరావతి నిర్మాణంలో జాప్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు ఈ కొత్త మెట్రోపాలిటన్ డెఫినిషన్‌ను తెరపైకి తెచ్చారనేది వైసీపీ ప్రధాన ఆరోపణ. రాజధాని అమరావతి ప్రాంతం కేవలం భౌగోళిక నిర్మాణం కాక ఏపీ భవిష్యత్ ఆర్థిక ఇంజిన్ కాబోతుందా లేదా రాజకీయ వివాదాల నిలయంగా మిగిలిపోతుందా అనేది రాబోయే రెండేళ్లలో పనుల పురోగతి , పైనే ఆధారపడి ఉంటుంది.

# ఏళ్లలో 30 మండలి ఖాళీలు




**గుంటూరు,** : ఆంధ్రప్రదేశ్ రాజకీయం ప్రస్తుతం శాసనమండలి నామినేటెడ్ స్థానాల చుట్టూ తిరుగుతోంది. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం తెలుగుదేశం పార్టీలో దాదాపు ఇరవై మందికి పైగా సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడుతుండటం అమరావతి వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే, ప్రస్తుతం ఖాళీ అయిన రెండు స్థానాల కోసమే క్యూలో నిలబడి అసంతృప్తికి లోనుకావాల్సిన అవసరం లేదని, కాస్త ఓపిక పడితే ఆశావహులందరికీ పదవులు దక్కడం ఖాయమని సమగ్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని 164 స్థానాల బలం ఆధారంగా రాబోయే మూడేళ్లలో మండలి మాత్రమే కాకుండా పార్లమెంట్ ఎగువ సభ అయిన రాజ్యసభ సీట్లు కూడా ఏకపక్షంగా కూటమి ఖాతాలోనే పడనున్నాయి. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలోని మొత్తం 58 స్థానాలు ఉన్నాయి. 2026 నుంచి మార్చి 2029 నాటికి సుమారు 30కి పైగా సభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఇందులో ఎమ్మెల్యే కోటా, స్థానిక సంస్థల కోటా, గవర్నర్ నామినేటెడ్, ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలు ఉన్నాయి. గతంలో వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ ఖాతాలో పడిన స్థానాలన్నీ వరుసగా ఖాళీ అవుతూ వస్తున్నాయి. అసెంబ్లీలో ప్రతిపక్షానికి కనీస బలం కూడా లేకపోవడంతో, త్వరలో ఖాళీ కాబోయే ప్రతి ఒక్క సీటూ పోటీయే లేకుండా ఏకగ్రీవంగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఖాతాలోనే పడనున్నాయి. ముఖ్యంగా 2026 నుంచి 2027 చివరి నాటికి గవర్నర్ నామినేటెడ్ కోటాలో 6 సీట్లు, ఎమ్మెల్యే కోటాలో దాదాపు 7 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. దీనికి తోడు స్థానిక సంస్థల కోటాలో కూడా 10 స్థానాల గడువు ముగియనుంది. అప్పటికి స్థానిక ఎన్నికలు అయిపోతాయి. సహజంగానే అధికార పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుంది. అసెంబ్లీలో కూటమికి ఉన్న సంపూర్ణ ఆధిక్యంతో ఎమ్మెల్యే కోటాలోని స్థానాలన్నీ కూటమికే దక్కుతాయి. మెజారిటీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూటమి వైపు మొగ్గు చూపడం లేదా ఖాళీలు ఏర్పడటంతో ఆయా జిల్లాల్లో కూటమి అభ్యర్థుల విజయం సునాయాసంగా మారనుంది. 2029 మార్చి నాటికి ఎమ్మెల్యే కోటాలో మరో 7 స్థానాలు ఖాళీ కానుండటంతో పాటు, పట్టభద్రుల. ఉపాధ్యాయుల స్థానాల గడువు కూడా పూర్తికానుంది. పట్టభద్రుల స్థానాల్లో ఇప్పటికే కూటమికి విపరీతమైన ఆమోదయోగ్యత ఉందని గత ఫలితాలు నిరూపించాయి. దీనివల్ల నాటి ఎన్నికల నాటికి శాసనమండలిలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రాతినిధ్యం దాదాపు శూన్యానికి చేరుకుని, మండలిలో ఎన్డీయే కూటమికి తిరుగులేని సంపూర్ణ మెజార్టీ లభిస్తుంది. కేవలం శాసనమండలి మాత్రమే కాదు, ఢిల్లీలోని రాజ్యసభ సీట్ల సమీకరణలు కూడా కూటమికి అత్యంత సానుకూలంగా మారాయి. ఎంపీల పదవీకాల ముగింపు క్రమంలో 2028లో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాలు నూరు శాతం కూటమి ఖాతాలోనే పడనున్నాయి. కేంద్రంలోనూ ఎన్డీయే భాగస్వామిగా ఉన్న టీడీపీ-జనసేనలకు ఈ రాజ్యసభ స్థానాలు దక్కడం వల్ల జాతీయ రాజకీయాల్లోనూ కూటమి నేతల ప్రాధాన్యత, ప్రాతినిధ్యం మరింత పెరగనుంది. ఈ పరిణామాలన్నింటినీ విశ్లేషిస్తే, ప్రస్తుతం గవర్నర్ కోటాలోని రెండు ఎమ్మెల్సీ పదవుల కోసం టీడీపీ అగ్రనేతలపై ఒత్తిడి తేవడం లేదా నిరాశకు గురికావడం సమంజసం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మూడేళ్ల వ్యవధిలో దాదాపు 30కి పైగా ఎమ్మెల్సీ స్థానాలు, 4 రాజ్యసభ స్థానాలు అందుబాటులోకి రానున్నందున.. పార్టీ కోసం పనిచేసిన సీనియర్లు, సామాజిక సమీకరణల్లో వెనుకబడిన నాయకులు, ఎన్నికల్లో త్యాగాలు చేసిన అభ్యర్థులకు విడతల వారీగా పదవులు అప్పగించేందుకు చంద్రబాబు వద్ద స్పష్టమైన రోడ్‌మ్యాప్ ఉందని చెబుతున్నారు. పార్టీ శ్రేణులు ఓపిక పడితే ప్రతి అర్హులైన నాయకుడికీ తగిన గుర్తింపు లభించడం ఖాయమని అంటున్నారు.

# మూగబోయిన ఫైర్ బ్రాండ్స్

**విజయవాడ,** : 2024 ఎన్నికల ఓటమి అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ఊహించని మలుపు తిరిగింది. గతంలో ప్రత్యర్థిపార్టీల నేతలపై నిమిషానికో రీతిలో విరుచుకుపడే ఫైర్ బ్రాండ్ నాయకులు ఆర్.కే. రోజా, కొడాలి నాని, జోగి రమేష్, వల్లభనేని వంశీ వంటి కీలక నేతలు రాజకీయంగా పూర్తిగా మౌనం వహించారు. ఎన్నికలు ముగిసి రెండేళ్లు దాటిపోయినా వీరు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనకపోవడం, మీడియా ముందుకు రాకపోవడం కేడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది. ప్రస్తుతం కేవలం పేర్ని నాని, అంబటి రాంబాబు వంటి కొద్దిమంది నాయకులు మాత్రమే మైకుల ముందుకు వచ్చి ప్రత్యర్థులపై ఎదురుదాడి చేస్తున్నారు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నమోదైన వరుస కేసులు, చట్టపరమైన చర్యల భయంతో స్లో అయ్యారు. జోగి రమేష్ పై సిఐడి కేసులు, అగ్రిగోల్డ్ భూ వివాదం, తాజాగా కుటుంబం కేసులు కూడా వచ్చి పడ్డాయి. అలాగే వల్లభనేని వంశీ చాలా రోజులు జైల్లో ఉండి వచ్చారు. కొడాలి నాని అనారోగ్యం, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అసలు గుడివాడలోనే కనిపించడంలేదు. ఐదేళ్ల పాలనలో వ్యక్తిగత దూషణలతో తీవ్ర స్థాయి విమర్శలు చేసిన ఈ నేతలు, ఇప్పుడు అధికార పక్షం కఠినంగా వ్యవహరిస్తుండటంతో చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకునేందుకు తాత్కాలికంగా రక్షణాత్మక వైఖరి లోకి వెళ్లిపోయారనేది స్పష్టమవుతోంది. మరోవైపు, ప్రతిపక్షంలో ఉన్న ఈ సమయంలో తీవ్రంగా విరుచుకుపడే నాయకులు మీడియా ముందు రాకపోతే పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రాదనేది పక్కా వాస్తవం. జగన్ మోహన్ రెడ్డి సైతం క్షేత్రస్థాయికి వచ్చి నిరసనలకు పిలుపునిస్తున్నా, దూకుడైన నేతల నాయకత్వం లేకపోవడం వల్ల ఆందోళనలు ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నాయి. పేర్ని నాని, అంబటి రాంబాబులు ఒంటరి పోరాటం చేస్తున్నప్పటికీ, రాయలసీమ నుంచి రోజా, కృష్ణా జిల్లా నుంచి కొడాలి నాని, వంశీ, జోగి రమేష్ వంటి వారు జతకలిస్తేనే పార్టీ కేడర్‌లో పూర్వ వైభవం, మైలేజ్ లభిస్తాయని వైఎస్సార్సీపీ శ్రేణులు భావిస్తున్నాయి. అయితే, వీళ్లను జగన్ ఎప్పుడు యాక్టివ్ చేస్తారు? లేదా వారే స్వయంగా బయటకు వస్తారా? అనే ప్రశ్నలకు పార్టీ వ్యూహకర్తల నుంచి భిన్నమైన సమాధానాలు వస్తున్నాయి. ఎన్నికలకు ముందు అధికారంలో ఉన్నప్పుడు చేసిన విమర్శల వల్లే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని భావిస్తున్న జగన్, ప్రస్తుతానికి కొత్త డెసిషన్ తీసుకునే ముందు కొంత సమయం ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా, ప్రభుత్వం విధించే చట్టపరమైన సవాళ్లు , కేసుల తీవ్రత కొంత తగ్గిన తర్వాతే లేదా స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి వీరిని మళ్లీ ముందువరుసలోకి తెచ్చేలా వ్యూహం రచిస్తున్నారని సమాచారం. అందుకే వారు వారి వారి నియోజకవర్గాల్లో పెద్దగా పార్టీ వ్యవహారాలను పట్టించుకోకపోయినా .. లైట్ తీసుకుంటున్నారని అంటున్నారు. వైఎస్సార్సీపీ తిరిగి పుంజుకోవాలంటే కేవలం జగన్ ఓరల్ ప్రసంగాలు సరిపోవు. క్షేత్రస్థాయిలో కౌంటర్ ఇవ్వగలిగే బలమైన గొంతులు మళ్లీ ప్రజా క్షేత్రంలోకి రావడం అత్యంత అవసరం. ఈ నేతలు తమ వ్యక్తిగత, న్యాయపరమైన సవాళ్లను దాటుకుని ధైర్యంగా ముందుకు వస్తే తప్ప వైఎస్సార్సీపీ కేడర్‌లో కోల్పోయిన ఆత్మవిశ్వాసం తిరిగొచ్చే అవకాశం లేదు. మరి దానికి జగన్ ఏం చేయబోతున్నారో

# భారతికి కీలక బాధ్యతలు



**కడప,** : వైసీపీలో అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్ర ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఆయన నాయకత్వమే ప్రధాన బలంగా నిలిచింది. పార్టీ విజయాలు, పరాజయాలు, రాజకీయ నిర్ణయాలు అన్నీ కూడా జగన్ చుట్టూనే తిరిగాయి. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీ నిర్వహణలో మరో కీలక నాయకత్వం అవసరమనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. గతంలో విజయసాయిరెడ్డి పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించారని భావించేవారు. ఆయన పార్టీకి దూరమైన తర్వాత ఆ బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డి సమన్వయం చేస్తున్నారని ప్రచారం ఉన్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఇంకా మార్పులు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నేతలు కోటరీ రాజకీయాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జగన్ కొత్త వ్యూహం సిద్ధం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రానున్న సంవత్సరాల్లో ఆయన ప్రజల మధ్య ఎక్కువ సమయం గడపాలని, రాష్ట్రవ్యాప్తంగా విస్తృత పర్యటనలు చేపట్టాలని భావిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అలాంటి సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలను చూసుకునే నమ్మకమైన నాయకత్వం అవసరమని ఆయన భావిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. జగన్ సతీమణి వైఎస్ భారతి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. కుటుంబ సభ్యురాలు కావడం, సంస్థాగత వ్యవహారాలపై అవగాహన ఉండడం, నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉండడం వంటి కారణాలతో ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇతర నేతలకు అలాంటి బాధ్యతలు ఇస్తే అంతర్గత విభేదాలు వచ్చే అవకాశం ఉంటుందని కొందరు అభిప్రాయపడుతుండగా, భారతి అయితే అందరినీ సమన్వయం చేయగలరని కూడా అంటున్నారు. ఇప్పటి వరకు భారతి ప్రత్యక్ష రాజకీయాల్లో పెద్దగా చురుకుగా కనిపించలేదు. అయితే ఎన్నికల సమయంలో పులివెందుల ప్రాంతంలో జగన్ తరఫున ప్రచారం నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. అలాగే వ్యాపార, సంస్థాగత అంశాల నిర్వహణలో ఆమెకు అనుభవం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అనుభవం పార్టీ నిర్వహణలో ఉపయోగపడుతుందని కొందరు విశ్లేషిస్తున్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో కడప లోక్‌సభ స్థానం నుంచి భారతిని పోటీ చేయించే అవకాశాన్ని జగన్ పరిశీలిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్ అవినాష్ రెడ్డి ఇప్పటికే వరుస విజయాలు నమోదు చేశారు. అయితే భవిష్యత్తులో భారతిని బరిలోకి దింపితే ఆ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలపై కూడా పార్టీకి మరింత బలం చేకూరుతుందనే అంచనాలు కొందరు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇవన్నీ ఇప్పటికైతే అధికారికంగా ధృవీకరించబడిన విషయాలు కావు. పార్టీ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అందువల్ల భారతి పార్టీ కీలక బాధ్యతలు చేపడతారా, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారా అన్నది రాబోయే రోజుల్లోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మాత్రం ఈ ప్రచారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే కఠిన శిక్ష: నారా లోకేశ్

విజయవాడ, : ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్‌ప్రాక్టీస్‌కు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు? 2026 లోక్‌సభలో ఆమోదం పొందడంపై ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని చెప్పారు. పరీక్షల విశ్వసనీయతను కాపాడే దిశగా ఇది కీలక అడుగని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన లోకేశ్.. ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల మోసాలకు పాల్పడే వారిపై ఇక కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలతో పాటు పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమని, ప్రతిభ, పారదర్శకత, సమాన అవకాశాలే ఎప్పుడూ గెలవాలని ఆకాంక్షించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించిందని లోకేశ్ అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షను తిరిగి సమయానికి నిర్వహించి, లక్షలాది మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా కాపాడిందని గుర్తుచేశారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. ఇదే అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. ఈ బిల్లు లక్షలాది మంది విద్యార్థుల ఆశయాలను కాపాడే కీలక చట్టమని చెప్పారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే నిర్ణయమిదని అభిప్రాయపడ్డారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో సమగ్ర సంస్కరణల కోసం నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను కేంద్రం ఏర్పాటు చేయడం కూడా కీలక చర్యగా పేర్కొన్నారు

# 78% తగ్గిన టాటా మోటార్స్ పీవీ లాభం...




టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (పీవీ), ఏప్రిల్-జూన్‌లో రూ.859 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2025-26 ఇదే కాల లాభం రూ.4,003 కోట్లతో పోలిస్తే ఇది 78.54% తక్కువ. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.87,677 కోట్ల నుంచి 9% పెరిగి రూ.95,799 కోట్లకు చేరింది. టాటా మోటార్స్ పీవీ విక్రయాలు 46%, ఈవీ విక్రయాలు 112% వృద్ధి నమోదు చేయడం గమనార్హం.

దేశీయ పీవీ విపణిలో 14.3% వాటాతో రెండో స్థానాన్ని సంస్థ నిలబెట్టుకుంది. ఈవీ (విద్యుత్తు వాహన) విపణి వాటా స్థిరంగా 39% వద్ద ఉండగా, ఈ విభాగంలో అగ్రస్థానాన్ని కొనసాగించింది. సమీక్షా త్రైమాసికంలో తాత్కాలిక సరఫరా అవరోధాలతో, అనుబంధ సంస్థ జేఎల్ఆర్ టోకు విక్రయాలు వార్షికంగా 9.2% తగ్గడం, కమొడిటీ ధరలు పెరగడం సంస్థ లాభాలపై ప్రభావం చూపింది. 'వినియోగదార్ల నుంచి మా వాహనాలకు గిరాకీ బాగుంది. కొత్త వాహనాలకు లభించిన ఆదరణ వల్ల పరిశ్రమలోనే అత్యధికంగా 46% వార్షిక విక్రయాల వృద్ధి సాధించాం. రికార్డు స్థాయిలో 34,000కు పైగా ఈవీలు విక్రయించామ'ని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర వెల్లడించారు. నాయకత్వ మార్పుతో ప్రణాళికలు ప్రభావితం కావు:

వృద్ధిని సాధించడం, వాటాదార్లకు నిరంతర విలువను సృష్టించడంపై టాటా మోటార్స్ పీవీ పూర్తిగా దృష్టి సారిస్తుంది. టాటా సన్స్ నాయకత్వంలో వచ్చే మార్పు వల్ల, మూలధన వ్యయ ప్రణాళికలు ప్రభావితం కావని ఎర్నింగ్స్ కాల్‌లో శైలేష్ వెల్లడించారు. టాటా మోటార్స్ పీవీ వ్యూహాలు అమలు చేసేందుకు బలమైన యాజమాన్య బృందం ఉందని పేర్కొన్నారు.

# ఆరు నెలల గరిష్టానికి వాణిజ్య లోటు....

### - జులైలో 31.9ష్టాలియన్ డాలర్లు




అమెరికా యుద్ధోన్మాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు, అంతర్జాతీయ సముద్ర రవాణా వ్యయాల భారం భారత వాణిజ్య లోటును అమాంతం పెంచుతున్నాయి. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన తాజా వివరాల ప్రకారం.. జులై నెలలో భారత్ సరుకు వాణిజ్య లోటు 31.98 బిలియన్ డాలర్లకు చేరి ఆరు నెలల గరిష్ఠ స్థాయికి ఎగిసింది. జూన్ నెలలో 30.43 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ లోటు.. ఆర్థికవేత్తలు అంచనా వేసిన 30.20 బిలియన్ డాలర్ల కంటే భారీగా పెరగడం ఆందోళకరం. దిగుమతి వ్యయం వేగంగా పెరగడమే ఈ వాణిజ్య లోటు విస్తరణకు ప్రధాన కారణంగా నిలిచింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు, రవాణా ఆటంకాలు ఉన్నప్పటికీ, ఎలక్ట్రానిక్స్, బంగారం దిగుమతులు భారీగా పెరగడంతో దేశంలోకి వచ్చే వస్తువుల బిల్లు అమాంతం ఎగబాకింది. జూన్ నెలలో 70.84 బిలియన్ డాలర్లుగా ఉన్న మొత్తం దిగుమతులు జులై నాటికి 76.22 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ముఖ్యంగా చిప్స్‌తో సహా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 44 శాతానికి పైగా పెరిగి 14.37 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి దిగుమతులు దాదాపు 5 శాతం పెరిగి 4.16 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. చమురు దిగుమతులు 18.31 బిలియన్ డాలర్లుగా నమోదు కావడంతో పాటు ఇతర ప్రధాన ఉత్పత్తుల దిగుమతి వ్యయం పెరగడం వల్ల వాణిజ్య లోటు తీవ్రమైంది. జులై నెలలో భారత వస్తు ఎగుమతులు 44.24 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం 2022 జులై నాటి 38.34 బిలియన్ డాలర్ల పాత రికార్డును దాటేశాయి. ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో పెరుగుతోన్న వాణిజ్య లోటు అంతిమంగా రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రస్తుత ప్రతికూల పరిస్థితులు రాబోయే రోజుల్లో భారత రూపాయి విలువపై, ఆర్థిక వ్యవస్థను మరింత ఒత్తిడి గురి చేసే అవకాశాలున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దక్షిణాసియా నుంచి అమెరికా, యూరప్ మార్గాల్లో షిప్పింగ్ ఫ్రైట్ రేట్లు విపరీతంగా పెరిగిపోవడం, కంటైనర్ల కొరత వల్ల బియ్యం, జౌళి, ఫార్మా ఉత్పత్తుల ఎగుమతిదారుల లాభ మార్జిన్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. పెరుగుతున్న దిగుమతి బిల్లుల కారణంగా విదేశీ మారక నిల్వలపై భారం పడే ప్రమాదం ఉండటంతో రానున్న నెలల్లో వాణిజ్య సమతుల్యతను కాపాడుకోవడం కేంద్ర ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా మారనుంది.

# జూలైలో వెండి దిగుమతులు 66 శాతం డౌన్



కేంద్ర ప్రభుత్వం మే 13న కస్టమ్స్ సుంకాలను భారీగా పెంచడంతో, జూలై నెలలో భారత పసిడి, వెండి దిగుమతులు ఒక్కసారిగా క్షీణించాయి. కేంద్ర ప్రభుత్వం విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని 6 శాతం నుండి ఏకంగా 15 శాతానికి పెంచిన నేపథ్యంలో, జూలై నెలలో వెండి దిగుమతులు ఏకంగా 66.1 శాతం డౌన్ అయ్యి 171.68 మిలియన్ డాలర్ల(రూ. 1,640 కోట్ల)కు పడిపోగా, బంగారం దిగుమతుల్లో కేవలం 4.77 శాతం వృద్ధి మాత్రమే నమోదై 4.16 బిలియన్ డాలర్ల(రూ. 39.7 వేల కోట్ల)కు పరిమితమైంది.

వాణిజ్య మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, ఏప్రిల్ నుంచి మే, జూన్‌లలో రెండంకెల వృద్ధి సాధించిన బంగారం దిగుమతులు జూలై వచ్చేసరికి సుంకాల పెంపుతో బ్రేకులు పడగా, భారత్ దిగుమతి చేసుకునే మొత్తం పసిడిలో దాదాపు 40 శాతం స్విట్జర్లాండ్ నుంచే రావడం విశేషం. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారం వినియోగదారైన భారతదేశంలో, ఈ డ్యూటీ పెంపు ప్రభావంతో దేశ రాజధానిలో 10 గ్రాముల పసిడి ధర రూ. 1,57,000కు, కిలో వెండి ధర రూ. 2.40 లక్షలకు చేరి ఆల్-టైమ్ రికార్డును నమోదు చేశాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, ఇటీవల భారీగా పెరిగిన ధరలు, గురువారం స్వల్పంగా తగ్గాయి. హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన పసిడి 10 గ్రాములు రూ. 1,53,710 ఉండగా, ఆభరణాల్లో వాడే 22 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ. 1,40,800గా నమోదైంది. వెండి కిలో రూ. 2.60 లక్షలుగా ఉంది.

# ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్




ఈనెల 4న ఫుకెట్ నుంచి ఢిల్లీకి 137 మంది ప్రయాణికులతో వస్తున్న ఎయిరిండియా విమానం అకస్మాత్తుగా 300 అడుగుల దిగువకు చేరడంతో, ఆ కుదుపులకు సిబ్బంది - ప్రయాణికులు 24 మంది గాయపడ్డారు. ఆ విమానం నడిపిన పైలట్‌కు నిర్వహించిన పరీక్షల్లో మత్తుపదార్థం (మార్జువానా/గంజాయి) తీసుకున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో తమ పైలట్లందరికీ తప్పనిసరిగా సైకోయాక్టివ్ సబ్‌స్టెన్స్ (మత్తు పదార్థాల) పరీక్షలు నిర్వహించాలని టాటా గ్రూప్ విమానయాన సంస్థలు ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నిర్ణయం తీసుకున్నాయి. గురువారం నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం విమానయాన సంస్థలు ప్రతి సంవత్సరం కనీసం 10% మంది సిబ్బందికి ర్యాండమ్‌గా ఈ పరీక్షలు నిర్వహిస్తే సరిపోతుంది. అయితే ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తమ 5000 మంది పైలట్లకూ ఈ పరీక్షలు నిర్వహించనున్నాయి. విమానయాన నిబంధనల ప్రకారం నిషేధించిన మందులు, పదార్థాలు ఏమైనా వాడారా అనేది పరిశీలించేందుకు సమగ్ర స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ఈ విషయాన్ని పైలట్లకు పంపిన అంతర్గత మెమోలో ఈ రెండు విమానయాన సంస్థలు తెలియజేశాయి. గురుగ్రామ్‌లోని ఎయిరిండియా అకాడమీలో జరిగే శిక్షణ సమయాల్లో, విమానాల రాకపోకల తర్వాత బ్రీఫింగ్ సెంటర్లు, విమానయాన సంస్థల కార్యాలయాల్లో, లేదా నిర్దేశిత పైలట్ల హోమ్ బేస్‌ల వద్ద ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు సమాచారం. రెండేళ్లలో 100కి పైగా కొత్త విమానాలు.. ఎయిరిండియా సీఈఓ: అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నా, లాభాలు ఆర్జించే మార్గాలపై ఎయిరిండియా దృష్టి సారిస్తోందని ఆ సంస్థ సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ గురువారం తెలిపారు. రెండేళ్లలో 100కి పైగా విమానాలు సంస్థకు చేరతాయని వెల్లడించారు. ప్రస్తుతం ఎయిరిండియా గ్రూప్‌లో 300 వరకు విమానాలున్నాయి.బోయింగ్ 787-8 విమానాలు 16 వరకు నవీకరిస్తున్నారు. ఇవి కూడా 2027లో సంస్థకు చేరతాయి. సిబ్బందికి వార్షిక వేతనాల పెంపు అక్టోబరు 1 నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు. పైలట్లకు సవరించిన వేతన విధానం కూడా అదే రోజు నుంచి వర్తిస్తుందని సమాచారం. పశ్చిమాసియా పరిణామాలు విమానయాన సంస్థల కార్యకలాపాలు, ఖర్చులపై తీవ్ర ప్రభావం చూపడంతో.. ఈ ఏడాది ఆరంభంలో వేతన పెంపును ఒక త్రైమాసికం పాటు ఎయిరిండియా వాయిదా వేసింది.

# తగ్గిన పసిడి ధరలు....



గత కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతూ వస్తున్న పసిడి ప్రియులకు ఎట్టకేలకు శుభవార్త అందింది. మార్కెట్లో శుక్రవారం బంగారం ధరలు ఊహించని విధంగా భారీగా తగ్గాయి. కొద్ది గంటల వ్యవధిలోనే ధరల్లో గణనీయమైన మార్పు కనిపించడంతో, ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి సమయంగా నిపుణులు భావిస్తున్నారు.

ఆగస్ట్ 14న దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లోని తాజా ధరల వివరాలు కింది విధంగా ఉన్నాయి. హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు భారీగా క్షీణించాయి. ఇక్కడ 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,52,590కి చేరగా, ఒక్కరోజే రూ.710 మేర తగ్గుదల నమోదైంది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర రూ.650 తగ్గి రూ.1,40,150 వద్ద ట్రేడవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో కూడా ఇంచుమించు ఇదే రకమైన ధరలు కొనసాగుతున్నాయి. దక్షిణాదిలోని ఇతర ప్రధాన నగరాలైన చెన్నై మరియు బెంగళూరులో కూడా ధరలు తగ్గాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,55,140గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,42,210గా ఉంది. ఇక బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం రూ.1,52,890 వద్ద, 22 క్యారెట్ల బంగారం రూ.1,40,150 వద్ద స్థిరపడ్డాయి. దేశ రాజధాని ఢిల్లీలోనూ బంగారం ధరలు గణనీయంగా పడిపోయాయి. ఇక్కడ 24 క్యారెట్ల బంగారం ధర రూ.710 తగ్గి రూ.1,53,040కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర రూ.650 క్షీణించి రూ.1,40,300 వద్ద కొనసాగుతోంది.

ముంబై నగరంలో కూడా ఢిల్లీకి సమానమైన ధరలే నమోదవుతున్నాయి. బంగారం ధరలు భారీగా తగ్గినప్పటికీ, వెండి ధరల్లో మాత్రం పెద్దగా మార్పులు రాలేదు.

ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2.55 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.2,59,900గా ఉండగా, చెన్నైలో కూడా అదే ధర పలుకుతోంది. బెంగళూరులో మాత్రం కిలో వెండి రూ.2.55 లక్షల వద్ద ట్రేడవుతోంది. నగరాలు, మార్కెట్ పరిస్థితులు, స్థానిక పన్నులు మరియు ఇతర ఛార్జీల ఆధారంగా బంగారం, వెండి ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. అందువల్ల ఆభరణాలు కొనుగోలు చేయడానికి వెళ్లేముందు మీ ప్రాంతంలోని జువెల్లరీ షాపుల్లో తాజా ధరలు, మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ తదితర వివరాలను కచ్చితంగా సరిచూసుకోవడం మంచిది.

# ఏఐ వల్లే ఐటీలో హైరింగ్ తగ్గింది...





దేశీయ యువతకు తగినన్ని ఉద్యోగాలు కల్పించకలేకపోవడం ప్రస్తుతం భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటని జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు అన్నారు. భారీగా ఉద్యోగావకాశాలు...

న్యూఢిల్లీ: దేశీయ యువతకు తగినన్ని ఉద్యోగాలు కల్పించకలేకపోవడం ప్రస్తుతం భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటని జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు అన్నారు. భారీగా ఉద్యోగావకాశాలు కల్పించే ఐటీ రంగంలోనూ నియామకాలు మందగించాయని.. టెక్ కంపెనీలు తమ నిధులను కృత్రిమ మేధ (ఏఐ), డేటా సెంటర్ మౌలిక వసతుల వైపు మళ్లిస్తుండటం ఇందుకు కారణమని తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. కొత్త ఉద్యోగులకు చేరాల్సిన సొమ్ము ఇప్పుడు ఏఐ, డేటా సెంటర్లలోకి వెళుతోందన్నారు. సాఫ్ట్‌వేర్ కూడా కమోడిటీలా మారుతోంది. దాంతో సాఫ్ట్‌వేర్ కంపెనీల మధ్య పోటీ శరవేగ విస్తరణ నుంచి నాణ్యత, విశ్వసనీయత, బ్రాండ్ వేల్యూ వం టి అంశాల వైపు మళ్లుతోంది. దాంతో ఐటీ ఇండస్ట్రీలో వృద్ధి మరింత మందగించనుంది. ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లు తమ ఐటీ వ్యయ బడ్జెట్‌ను కూడా ఏఐ టెక్నాలజీ కోసం మళ్లిస్తున్నారు. ఏఐ కంపెనీలు భారీగా అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెడుతున్నాయి. కానీ, వాటికి అందుకు తగ్గ ప్రతిఫలాలు లభిస్తాయా..? అన్న విషయంపై స్పష్టత లేదు.

ఆయన ప్రస్తావించిన మరిన్ని విషయాలు.. సాఫ్ట్‌వేర్ డెవల్‌పమెంట్‌లో ఏఐతో ఉత్పాదకత మరింత పెరిగింది. కానీ, ప్రపంచ మార్కెట్‌కు మరింత సాఫ్ట్‌వేర్ అవసరమా అన్నదే నా ప్రశ్న. సాఫ్ట్‌వేర్ కూడా కమోడిటీలా మారుతోంది. దాంతో సాఫ్ట్‌వేర్ కంపెనీల మధ్య పోటీ శరవేగ విస్తరణ నుంచి నాణ్యత, విశ్వసనీయత, బ్రాండ్ వేల్యూ వం టి అంశాల వైపు మళ్లుతోంది. దాంతో ఐటీ ఇండస్ట్రీలో వృద్ధి మరింత మందగించనుంది.

ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లు తమ ఐటీ వ్యయ బడ్జెట్‌ను కూడా ఏఐ టెక్నాలజీ కోసం మళ్లిస్తున్నారు. ఏఐ కంపెనీలు భారీగా అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెడుతున్నాయి. కానీ, వాటికి అందుకు తగ్గ ప్రతిఫలాలు లభిస్తాయా..? అన్న విషయంపై స్పష్టత లేదు.

# దేశంలో ఐఫోన్ల కొరత



సాధారణంగా రెండు మూడు రోజుల్లో పూర్తయ్యే డెలివరీలు ఇప్పుడు వారానికి పైగా సమయం తీసుకుంటున్నాయి. టెక్ దిగ్గజం యాపిల్ తన వార్షిక ఐఫోన్ లాంచ్ ఈవెంట్ సమీపిస్తున్న వేళ, భారతీయ మార్కెట్‌లో ఐఫోన్లు, మ్యాక్‌బుక్‌ల లభ్యత పడిపోవడం పండగ షాపింగ్‌కు సిద్ధమవుతున్న కస్టమర్లను, వ్యాపారులను ఆందోళనకు గురిచేస్తోంది. దేశీయ మార్కెట్‌లో ఐఫోన్లతో పాటు మ్యాక్‌బుక్‌ల సరఫరా తగ్గిపోవడంతో, సాధారణంగా రెండు మూడు రోజుల్లో పూర్తయ్యే డెలివరీలు ఇప్పుడు వారానికి పైగా సమయం తీసుకుంటున్నాయి. దేశంలోని ఆరు అధికారిక యాపిల్ స్టోర్లలో స్టాక్ భర్తీ చేయడం ఆలస్యం కావడంతో పాటు, ప్రధాన నగరాల్లోని రిటైలర్ల వద్ద కూడా ఐఫోన్ 15, 16, 17 మోడళ్లు లభించడంలేదు. ఈ సరఫరా ఇబ్బందులను యాపిల్ వర్గాలు అంగీకరించినప్పటికీ, ఇది కేవలం తమ సమస్య మాత్రమే కాదని, అంతర్జాతీయంగా విడిభాగాల లభ్యత తగ్గడంతో ఇతర స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లు కూడా ఇదే తరహా సరఫరా కొరతను ఎదుర్కొంటున్నాయని స్పష్టం చేశాయి. అయితే ఈ ఫోన్ల కొరత వెనుక కేవలం కంపెనీల తయారీ సమస్యలే కాకుండా, రిటైలర్ల లాభాల వ్యాపార వ్యూహం కూడా ఉంది. సాధారణంగా కొత్త ఐఫోన్ రాగానే పాత ఫోన్ల ధరలు తగ్గుతాయి. కానీ రాబోయే ఐఫోన్ 18 మార్కెట్లోకి వచ్చినా కూడా ఈసారి పాత ఫోన్ల ధరలు తగ్గవని, పైగా ఫోన్లు సరిపడా లేకపోవడం వల్ల వాటి ధరలు మరింత పెరగొచ్చని రిటైలర్లు భావిస్తున్నారు. అందుకే భవిష్యత్తులో ఎక్కువ లాభాలకు అమ్ముకోవచ్చనే ఆశతో, తమ వద్ద ఉన్న ఫోన్ల స్టాక్‌ను బయటకు తీయకుండా దాచి ఉంచుతున్నారు. ఐడీసీ గణాంకాల ప్రకారం, 2026లో యాపిల్ మార్కెట్ వాటా కొద్దిగా తగ్గినప్పటికీ, ఈ కొరత, సరఫరా సమస్యల మధ్య కూడా ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో దేశంలో అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్‌గా 'ఐఫోన్ 17' మొదటి స్థానంలో నిలిచింది.

## వారానికి ఓ పాలి.. ఇక నీకు తిరుగుండదోయి..



కరివేపాకు సాధారణంగా మనం కూరల నుండి తీసి పక్కన పెట్టేస్తుంటాం. కానీ అదే కరివేపాకుతో అద్భుతమైన రుచికరమైన, ఆరోగ్యకరమైన పులుసును సులభంగా తయారు చేసుకోవచ్చు. కంటి చూపు మెరుగుపరచడం, జుట్టు ఆరోగ్యానికి, రక్తాన్ని శుద్ధి చేయడానికి కరివేపాకు ఎంతో మేలు చేస్తుంది. ఈ వంటకం వారానికి ఒకసారైనా తింటే పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. మనం ప్రతిరోజూ వండుకునే కూరల్లో అద్భుతమైన రుచిని, సువాసనను అందించే కరివేపాకును చాలామంది తినేటప్పుడు తీసి పక్కన పెట్టేస్తుంటారు. అయితే, ఈ కరివేపాకు కేవలం రుచి కోసమే కాకుండా, మన ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. కంటి చూపు మెరుగుపరచడం నుండి జుట్టు కుదుళ్లను బలోపేతం చేయడం వరకు, శరీరంలోని మలినాలను పోగొట్టి రక్తాన్ని శుద్ధి చేసే అద్భుతమైన శక్తి కరివేపాకుకు ఉంది.

కావలసిన పదార్థాలు: కరివేపాకు – 2 కప్పులు, నూనె – సరిపడినంత, ఆవాలు – అర స్పూన్, జీలకర్ర – పావు స్పూన్, ఎండుమిర్చి – 1, వెల్లుల్లి రెబ్బలు – గుప్పెడు, పచ్చిమిర్చి – 2–3 (ముక్కలు), ఉల్లిపాయలు – 4 (సన్నగా తరిగినవి), ఉప్పు – రుచికి సరిపడా, పసుపు –కొద్దిగా, కారం – 2 స్పూన్లు (తినే కారాన్ని బట్టి), బెల్లం – చిన్న ముక్క, చింతపండు రసం – నిమ్మకాయ సైజంత చింతపండు నుండి తీసినది, నీళ్ళు ? సరిపడినంత

తయారీ విధానం: 1. కరివేపాకు వేయించడం: ముందుగా స్టవ్ మీద కడాయి పెట్టి, రెండు మూడు స్పూన్ల నూనె వేసి వేడి చేయాలి. నూనె కాగిన తర్వాత కడిగి, తడి లేకుండా ఆరబెట్టిన రెండు కప్పుల కరివేపాకు వేసుకోవాలి. మంటను మీడియం ఫ్లేమ్ లో ఉంచి, కరివేపాకు క్రిస్పీగా అయ్యేంత వరకు కలుపుతూ వేయించాలి. సరిపడినంత నూనె వేసుకోవడం ముఖ్యం. వేగిన కరివేపాకును నూనె రాకుండా ఒక గిన్నెలోకి తీసుకుని, పూర్తిగా చల్లారిన తర్వాత మిక్సీ జార్ లో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. రోట్లో వేసుకున్నా బాగా మెత్తగా రుబ్బుకోవచ్చు. 2. పోపు తయారీ: కరివేపాకు వేయించిన నూనెలో కూరకి సరిపడినంత నూనె అదనంగా వేసుకోవాలి. నూనె కాగిన తర్వాత అర స్పూన్ ఆవాలు, పావు స్పూన్ జీలకర్ర, ఒక ఎండుమిర్చి వేసి ఒకసారి కలిపి, తొక్కలు వలిచిన గుప్పెడు వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. వెల్లుల్లి ఇష్టం లేని వారు స్కిప్ చేయవచ్చు. ఇవి వేగిన తర్వాత రెండు మూడు పచ్చిమిర్చిల ముక్కలు, సన్నగా తరిగిన నాలుగు ఉల్లిపాయల ముక్కలు వేసి రుచికి సరిపడా ఉప్పు కూడా కలపాలి.

# ఈ స్నాక్‌తో పిల్లలకు ఐరన్, కాల్షియం కొండంత బలం!



మన పూర్వీకులు రాగులతో చేసిన వంటకాలను ఎక్కువగా తీసుకోవడం వల్లే ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉండేవారు. ఈ మధ్యకాలంలో జనాల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి మళ్లీ సిరిధాన్యాల వాడకం పెరిగింది. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రక్తహీనత, ఎముకల బలహీనత వంటి సమస్యలకు రాగులు ఒక సంజీవనిలా పనిచేస్తాయని పెద్దలు చెబుతున్నారు. మరి అంతటి పోషక విలువలున్న రాగి పిండితో ఎప్పుడూ ఒకే లాంటి టిఫిన్స్ తింటే బోర్ కొడుతుంది కదా. అందుకే ఎప్పటిలాగా రాగి దోసా, రోటీ, సంకటి లాంటివి కాకుండా కేవలం కొద్ది నిమిషాల్లోనే ఎంతో రుచికరమైన రాగి చెక్కలను ఎలా చేసుకోవాలో ఈ స్పెషల్ స్టోరీలో తెలుసుకుందాం? కావలసిన పదార్థాలు: రాగి పిండి/ బియ్యం పిండి (చెక్కలు క్రిస్పీగా రావడం కోసం)/ వేరుశెనగ పప్పులు (కొద్దిగా కచ్చాపచ్చాగా దంచినవి)/ నువ్వులు/ పచ్చిమిర్చి, అల్లం పేస్ట్/ కరివేపాకు, కొత్తిమీర తరుగు/ ఉప్పు (తగినంత)/ వెన్న లేదా వేడి నూనె (పిండి కలుపుకోవడానికి)/ డీప్ ఫ్రైకి సరిపడా నూనె తయారీ విధానం.. ముందుగా ఒక వెడల్పాటి గిన్నెలో రాగి పిండి, కొద్దిగా బియ్యం పిండి తీసుకోండి. అందులో నువ్వులు, కచ్చాపచ్చాగా దంచిన వేరుశెనగ పప్పులు, తగినంత ఉప్పు వేసి బాగా కలుపుకోండి. తర్వాత ఈ మిశ్రమంలో పచ్చిమిర్చి–అల్లం పేస్ట్, సన్నగా తరిగిన కరివేపాకు, కొత్తిమీర వేయండి. చెక్కలు సాఫ్ట్‌గా, క్రిస్పీగా రావడం కోసం కొద్దిగా వెన్న లేదా వేడి నూనె వేసి పిండిని బాగా ముద్దలా కాకుండా పొడిపొడిగా కలుపుకోవాలి. ఇప్పుడు కొద్దికొద్దిగా గోరువెచ్చని నీటిని పోస్తూ, చపాతీ పిండి కంటే కొంచెం గట్టిగా (మరీ జారుడుగా కాకుండా) ముద్దలా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. అలా పక్కన పెట్టుకున్న పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ కవర్ లేదా బట్టర్ పేపర్‌పై కొద్దిగా నూనె రాసి, ఈ ఉండలను చేత్తో పలచని చెక్కల్లా ఒత్తుకోవాలి. ఆపై కాగుతున్న నూనెలో వేసి రెండు వైపులా చక్కగా కాలే వరకు మీడియం ఫ్లేమ్‌పై డీప్ ఫ్రై చేయాలి. అంతే ఆరోగ్యకరమైన రాగి చెక్కలు రెడీ.

# మద్యం కాలేయానికే కాదు.. మెదడుకూ ముప్పే..!



మద్యం సేవించడం వల్ల కాలేయం, గుండెకు మాత్రమే నష్టం జరుగుతుందని చాలామంది భావిస్తుంటారు. అయితే, మద్యం ప్రభావం మెదడుపైనా తీవ్రంగా పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తరచూ లేదా అధికంగా మద్యం సేవించడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, నిద్ర నాణ్యత వంటి మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతుందని న్యూరాలజిస్టులు చెబుతున్నారు.

మెదడులో జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యానికి కీలకమైన హిప్పోక్యాంపస్‌పై మద్యం మొదట ప్రభావం చూపుతుంది. దీని వల్ల తాత్కాలిక జ్ఞాపకాలను దీర్ఘకాలిక జ్ఞాపకాలుగా మార్చే ప్రక్రియ దెబ్బతింటుంది. ఫలితంగా ఎక్కువ మద్యం సేవించినప్పుడు కొందరికి 'బ్లాక్‌అవుట్స్' ఏర్పడి, ఆ సమయంలో జరిగిన విషయాలు పూర్తిగా గుర్తు లేకపోవచ్చు. అంతేకాదు.. మద్యం జ్ఞాపకశక్తినే కాకుండా మెదడులోని ఫ్రంటల్ లోబ్‌పై కూడా ప్రభావం చూపుతుంది. ఈ భాగం ఏకాగ్రత, ప్రణాళిక, సరైన నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాలను నియంత్రించడం వంటి కీలక పనులను నిర్వహిస్తుంది. మద్యం ఎక్కువగా తీసుకునేవారికి సంభాషణలను అర్థం చేసుకోవడం, పేర్లు గుర్తుంచుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి పనులు క్రమంగా కష్టమవుతాయి.

మద్యం తాగితే బాగా నిద్రపడుతుందని చాలామంది అనుకుంటారు. కానీ అది కేవలం తాత్కాలిక మత్తును మాత్రమే కలిగిస్తుంది.

## బాదం పప్పుతో మధుమేహానికి చెక్..!



భారతదేశంలో మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ ఆందోళనకరంగా పెరుగుతోంది. బ్లడ్ షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి మందులతో పాటు మనం తీసుకునే ఆహార నియమాలు కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్‌కు ముందు తీసుకునే ఆహారం రోజంతా మన జీవక్రియలను ప్రభావితం చేస్తుంది. అందుకే, డయాబెటిస్ ఉన్నవారు ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో నానబెట్టిన బాదంపప్పులను తినాలని వైద్యులు మరియు పోషకాహార నిపుణులు బలంగా సిఫార్సు చేస్తున్నారు. ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది: బాదంలో మెగ్నీషియం ఖనిజం పుష్కలంగా ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారిలో చాలా మందికి మెగ్నీషియం లోపం ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. శరీరంలో తగినంత మెగ్నీషియం ఉంటే, అది ఇన్సులిన్ హార్మోన్ కణాల్లోకి గ్లూకోజ్‌ను పంపే ప్రక్రియను సులభతరం చేస్తుంది. అంటే బాదం తినడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా వాడుకుంటుంది. షుగర్ స్పైక్స్‌ను అడ్డుకుంటుంది: బాదంపప్పులలో కార్బోహైడ్రేట్లు చాలా తక్కువగా ఉండి, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఉదయాన్నే పరగడుపున వీటిని తినడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది.

# ఫుల్ యాక్షన్ మోడ్‌లో తాప్సీ.....



తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'గాంధారి'. ఇష్వాక్ సింగ్, స్వస్తిక ముఖర్జీ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ మూవీకి దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్నాడు. కథ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ త్వరలో నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ అప్డేట్ నెట్టింట వైరల్ అవుతున్నది. ఈ సినిమా కోసం తాప్సీ శారీరకంగా ఎంతో శ్రమ చేస్తున్నట్లు తెలుస్తోంది. మహాభారతంలోని గాంధారి పాత్ర స్ఫూర్తితో, ఆధునిక సమాజంలో ఒక తల్లి, అలాగే భార్య కోణంలో ఎదురయ్యే భావోద్వేగ ప్రాధాన్యతల్ని నేటి శైలిలో ఈ సినిమాలో చూపించనున్నారు.

విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం తాప్సీ కెరీర్‌లో మరొక ప్రత్యేకమైన ప్రాజెక్ట్‌గా నిలవనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకోసమే ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల కోసం తాప్సీ కష్టపడుతూ తనను తాను మేకోవర్ చేసుకుంటుందని తెలుస్తుండగా.. అందుకు సంబంధించిన ఫొటో ఒకటి నెట్టింట వైరల్ అవుతూ సందడి చేస్తుంది. దీంతో ఈ సినిమా తాప్సీకి నిజంగా మంచి కమ్ బ్యాక్ ఇస్తుందంటూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు నెటిజన్లు.

## ఒక జనరేషన్‌ను మార్చే సినిమా హుషార్ పిట్టలు....



యంగ్ నటులు అన్ష్, వాసవి గణేషన్ జంటగా నటించిన లేటెస్ట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'హుషార్ పిట్టలు'. బిక్షు దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మించారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన కంటెంట్‌తో సినిమాపై యూత్‌లో ఎక్స్‌పెక్టేషన్స్ ఆకాశాన్ని అంటాయి. నెట్టింట సొంతం చేసుకున్న విశేష ఆదరణతో ఈ సినిమాని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు ఆగస్టు 15న భారీ ఎత్తున విడుదల చేస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా యంగ్ నటి వాసవి గణేషన్ మాట్లాడుతూ.. 'ఈ సినిమా ప్రివ్యూ చూసి అందరూ ఎంజాయ్ చేస్తున్నారు.. పెద్ద స్క్రీన్‌పై సినిమా చూస్తూ పెద్ద పెద్ద కేకలు వేస్తున్నారు. వాళ్లు అలా ఎంజాయ్ చేస్తుంటే.. అరే ఈ సీన్ చేసినప్పుడు మేము ఇంత కష్టపడ్డాము కదా, మా కష్టానికి ఫలితం దక్కింది అనే ఆనందం వేస్తుంది.

మా సినిమాకు వస్తున్న ప్రివ్యూస్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా మా అమ్మమ్మ ఏజ్ ఉన్న వాళ్ళు వాళ్ల మనవరాళ్లతో వచ్చి ఈ సినిమా చూస్తు ఎంజాయ్ చేస్తున్నారు. వాళ్లు నా దగ్గరకు వచ్చిన తప్పకుండా హిట్ అవుతుంది, ఇది ఒక జనరేషన్ ను మార్చే సినిమా అని చెబుతుంటే నాకు చాలా సంతోషంగా అనిపించింది. వాళ్ల మనవరాళ్లు కూడా 'అక్క ఇలా జరుగుతుందా అక్కా.. నేను ఇలా చెయ్యను అక్కా.. మా వాళ్లను మంచిగా చూసుకుంటా' అని చెబుతున్నారు. ఇంత బాగా అర్థం చేసుకుని మంచి మంచి రివ్యూస్ ఇస్తున్నారు' అంటూ ఆనందం వ్యక్తం చేసింది వాసవి.

## భారీ షెడ్యూల్ పూర్తి చేసుకున్న భోగి




శర్వానంద్ – సంపత్ నంది కాంబినేషన్‌లో 'భోగి' అనే పవర్‌ఫుల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను ఆగస్టు 28న విడుదల చేయనున్నారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో తాజాగా ఈ మూవీకి సంబంధించిన అత్యంత కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.

# దుల్కర్ 'ఐ యామ్ గేమ్' కొత్త రిలీజ్ డేట్ అనౌన్స్



దుల్కర్ సల్మాన్ సినిమాలకు మాలీవుడ్‌లోనే కాదు, దక్షిణాది మొత్తం ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. ఆయన కొత్త సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచే అంచనాలు మొదలవుతున్నాయి. ఇప్పుడు అదే స్థాయి హైప్ లో వెళ్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఐ యామ్ గేమ్'. అయితే ఈ మూవీ రిలీజ్ విషయంలో కీలక మార్పు చోటుచేసుకుంది. ఆగస్టు 20న థియేటర్లలోకి రావాల్సిన ఈ సినిమాను మేకర్స్ అధికారికంగా వాయిదా వేస్తూ కొత్త రిలీజ్ డేట్ ను ప్రకటించారు. నహాస్ హిదాయత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఐ యామ్ గేమ్'ను ఇప్పుడు 2026 సెప్టెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణం సినిమా థియేట్రికల్ విడుదలను మరింత విస్తృతస్థాయిలో అందించడానికేనని నిర్మాతలు తెలిపారు. 'ఐ యామ్ గేమ్' పోస్ట్ ప్రొడక్షన్ పనులలో కొంత జాప్యం జరగడం, అలాగే ఈ చిత్రాన్ని మరిన్ని భాషల్లో పాన్–ఇండియా రేంజ్‌లో విడుదల చేయాలనే ప్లాన్ ఉండటం వల్ల వాయిదా పడినట్లు తెలుస్తోంది. మేకర్స్ కూడా ఇదే క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమాను మొదట ఓనం కానుకగా 2026 ఆగస్టు 20న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com